# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 179 శనివారం 26 ఆగస్ట్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## గ్రీస్ నుంచి బెంగళూరుకు మోడీ

**బెంగళూరు, ఆగస్టు 25:**



చంద్రయాన్-3 మిషన్‌లో పాల్గొన్న శాస్త్రవేత్తలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ కలవనున్నారు. చంద్రుడిపై విక్రం ల్యాండర్‌ను విజయవంతంగా ల్యాండింగ్ చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను కలిసి అభినందించేందుకు ఈ నెల 26వ తేదీన మోదీ బెంగళూరు వెళ్లనున్నారు. చంద్రయాన్-3 మిషన్ వెనుక ఉన్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలను ప్రధాని భేటీ కానున్నారు.బ్రిక్స్ సదస్సు దృష్ట్యా ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉన్న ప్రధాని మోదీ అక్కడినుంచి గ్రీస్ పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడి నుంచి భారత్‌కు చేరుకోనున్నారు. అక్కడి పర్యటన అనంతరం మోదీ నేరుగా బెంగళూరు వెళ్లనున్నారు. ఇస్రోకు చెందిన టెలిమెట్రీ, ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ (ఇస్ట్రాక్)ను సందర్శించనున్నారు. ఇస్రో శాస్త్రవేత్తలను ప్రధాని భేటీ కానున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ భేటీ జరుగనుంది. అనంతరం ఉదయం 8.05 అక్కడి నుంచి బయలుదేరి 8.35 గంటలకు దిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అశోక తెలిపారు. పార్టీ జనరల్ సెక్రెటరీ బీఎల్ సంతోష్ ఆదేశాల మేరకు నగరంలో 10 వేల మందితో మెగా రోడ్ షో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రధాని కర్ణాటకలో పర్యటించడం ఇదే తొలిసారి. మోదీకి హెచ్ఏఎల్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ సిద్ధమైంది. 2023లో ఘోర పరాజయాన్ని చవిచూసిన పార్టీ, వచ్చే ఏడాది లోక్‌సభ

02

## ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25**

ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అనంతపురం జిల్లాలోని ఓబులాపురం మైనింగ్ కంపెనీకి 2007లో అక్రమంగా గనులు కేటాయించారని శ్రీ లక్ష్మిపై సిబిఐ కేసులు నమోదు చేసింది. సిబిఐ కోర్టులో ఆమెకు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టును శ్రీలక్ష్మి ఆశ్రయించారు. ఆమె పిటీషన్ ను విచారించిన తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మిపై ఉన్న అభియోగాలను కొట్టివేస్తూ గతేడాది నవంబర్ 8న ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై జస్టిస్ ఎ.ఎస్.బోపన్న, జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి శ్రీలక్ష్మికి నోటీసులు జారీ చేసింది. ఆమె ప్రస్తుతం ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారుఓఎంసీ కేసులో ఏపీ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మిపై సీబీఐ నమోదు చేయడానికి కారణాల్లేవని హైకోర్టు వెల్లడించింది. శ్రీలక్ష్మిపై ఐపీసీ 120బి రెడ్ విత్ 409, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(2) రెడ్ విత్ 13(1)(డి) కింద అభియోగాలను నమోదు చేయడానికి ఎలాంటి కారణాల్లేవని పేర్కొంది. అందువల్ల ఓఎంసీ కేసులో సీబీఐ నమోదు చేసిన ఈ అభియోగాల నుంచి శ్రీలక్ష్మిని తొలగిస్తున్నట్లు పేర్కొంది. ఇతర నిబంధనల కింద అభియోగాలను నమోదు చేస్తే విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. ఓఎంసీ కేసులో తనను డిశ్చార్జి చేయాలన్న పిటిషన్‌ను కొట్టేస్తూ అక్టోబరు 17న సీబీఐ ప్రధానకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను శ్రీలక్ష్మి హైకోర్టులో సవాలు చేశారు.

ఓఎంసీకి క్యాప్టివ్ మైనింగ్ కింద లీజులు కేటాయించడానికి వీలుగా 20కి పైగా దరఖాస్తులను తిరస్కరించారని సీబీఐ ఆరోపించింది. పెద్ద ఎత్తున ఆర్థిక ప్రయోజనాలు పొందాలని సీబీఐ తెలిపింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2007-2009 మధ్య కాలంలో శ్రీలక్ష్మి గనుల శాఖ కార్యదర్శిగా పని చేశారు.



అదే సమయంలో కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్ధన్ రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీకి రూ.80 లక్షలు లంచం తీసుకుని అనుమతులు ఇచ్చారని శ్రీలక్ష్మిపై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో శ్రీలక్ష్మి ఆరో నిందితురాలిగా ఉన్నారు. అలా ఆమె 2011లో అరెస్ట్ అయ్యారు. ఈ మేరకు దర్యాప్తు చేసిన సీబీఐ 2012లో ఛార్జిషీట్ కూడా దాఖలు చేసింది. దీనిపై దర్యాప్తు సమయంలో శ్రీలక్ష్మి ఏడాది పాటు చంచల్ గూడ జైలులో ఉన్నారు. ఆ అరెస్టు ఘటనతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీలక్ష్మిని సస్పెండ్ చేసింది. ఏప్రిల్ 2, 2013న చంచల్‌గూడ మహిళా జైలులో రిమాండ్ ఖైదీగా

02

## డెంగ్యూకు హైదరాబాదీ వ్యాక్సిన్




**హైదరాబాద్, ఆగస్టు 25:**

డెంగ్యూపై వార్ ప్రకటించిన భారత్ వ్యాక్సిన్ తయారీకి సిద్ధమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇమ్యూనాలాజికల్స్ లిమిటెడ్ టీకా తయారు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు వర్షాకాలంలో ప్రాణాంతక వ్యాధిగా ప్రజలను వేధిస్తున్న డెంగ్యూ ఫీవర్‌కి విరుగుడు వ్యాక్సిన్‌ని 2026 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇక దీనికి సంబంధించిన ప్రాథమిక దశ ప్రయోగాలు ఇప్పటికే ముగిశాయని, వాటిల్లో ఎలాంటి ప్రతికూల ఫలితాలు రాలేదని హైదరాబాద్ కంపెనీ తెలిపింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. దోమకాటుతో భారత్‌లో చాలా మందిని పీడిస్తున్న డెంగ్యూని అరికట్టడానికి టీకా రాబోతోంది. హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇమ్యూనాలాజికల్స్ లిమిటెడ్ .. ఎఎఒ కంపెనీ డెంగ్యూ ఫీవర్ వ్యాక్సిన్‌ను తయారు చేస్తోంది. టీకా అందుబాటులోకి వస్తే డెంగ్యూను నివారించడానికి చాలా ఉపయోగపడుతుందని వైద్య నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో 2026 నాటికి భారత్‌లో డెంగ్యూ వ్యాక్సిన్ వచ్చే అవకాశాలున్నాయి.డెంగ్యూ వ్యాధి లెక్కలను ఓ సారి పరిశీలిస్తే.. ఈ ఏడాది ఇప్పటి వరకు 31 వేల 464 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి. అలాగే 36 మంది మంది దీని బారిన పడి చనిపోయారు. వ్యాక్సిన్ తయారీ ప్రాథమిక దశలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ బయటపడలేదని వ్యాక్సిన్

## తిరుచానూరులో శాస్త్రోక్తంగా శ్రీ వరలక్ష్మీ వ్రతం

**- భక్తి శ్రద్ధలతో వ్రతం ఆచరించిన మహిళలు**

**తిరుపతి**

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం శ్రీ వరలక్ష్మి వ్రతం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన, మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించారు. ఈ పర్వదినాన అమ్మవారు బంగారుచీరతో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అనంతరం శ్రీ పద్మావతీ అమ్మవారి ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. అక్కడ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మి సహస్రనామార్చన, అష్టోతర శత నామావళి నిర్వహించారు. అమ్మవారిని రోజా, చామంతి, మల్లె, సంపంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూలు, వృక్షి వంటి పుష్పాలతో అమ్మవారిని ఆరాధించారు.

అమ్మవారిని 9 గ్రంథులతో(నూలుపోగు) అలంకరించారు. ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు గుర్తుగా ఆరాధించారు. భవిష్యోత్తర పురాణంలో వ్యాస భగవానుడు వరలక్ష్మి వ్రతం పూజావిధానాన్ని, మహత్యాన్ని తెలియజేశారని పాంచరాత్ర ఆలయ అర్చకులు శ్రీ శ్రీనివాసన్ తెలిపారు. పూర్వం శంకరుడు పార్వతిదేవికి ఈ వరలక్ష్మి వ్రతం విశిష్ఠత,



అచరించవలసిన విధానాన్ని తెలియచేసినట్లు పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. త్రేతాయుగంలో కుండలినీ నగరంలో నివసించిన చారుమతి అనే భక్తురాలు వరలక్ష్మి నోము ఆచరించి పొందిన ఫలప్రదాన్ని ఈ సందర్భంగా వివరించారు. సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి ప్రీతితో అవతరించిన తిరుచానూరులో వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలకు సత్సంతానం, దీర్ఘమాంగల్యసౌఖ్యం, సిరిసంపదలు, ఆరోగ్యం, కుటుంబసౌఖ్యం వంటి ఎన్నో మహాఫలాలు కలుగుతాయని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. తరువాత 12 రకాల నైవేద్యాలను అమ్మవారికి నివేదించారు. అనంతరం మహా మంగళ హారతితో వరలక్ష్మి వ్రతం ముగిసింది.

### భక్తులను విశేషంగా అకట్టుకున్న వ్రత మండపం

టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్యర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం భక్తులను విశేషంగా అకట్టుకుంది. 20 మంది సిబ్బంది, 2 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 20 వేల కట్ ఫ్లవర్స్ తో ఐదు రోజుల పాటు శ్రమించి అమ్మవారి ఆలయం, ఆస్థానమండపం, వ్రత మండపాన్ని సుందరంగా అలంకరించారు.

ఇందులో తమలపాకులు, అపిల్, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, మొక్కజొన్న, పైనాపిల్ వంటి ఫలాలు, వివిధ సంప్రదాయ పుష్పాలతో వ్రత మండపాన్ని అద్భుతంగా రూపొందించారు. మండపం పై భాగంలో గజలక్ష్మి అమ్మవారు, కింది భాగంలో రెండు వైపుల ఐరావతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆస్థాన మండపాన్ని

02



## దేశంలో తొలిసారిగా అల్పాహార పథకం

**చెన్నై, ఆగస్టు 25**

తమిళనాడులోని ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయన ఈ పథకాన్ని శుక్రవారం అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఇప్పటికే అక్కడ మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉంది. అయితే ఇప్పుడు తాజాగా ఆ మధ్యాహ్న భోజనం పథకంతో పాటుగా ఉదయం పూట అల్పాహారం కూడా అందించే విధంగా సీఎం స్టాలిన్ ఈ పథకాన్ని తీసుకొచ్చారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా ఉదయం అల్పాహారం అందించే పథకాన్ని ప్రారంభించలేదు. ఇప్పుడు పాఠశాలల్లో తొలిసారిగా అల్పాహారం పథకాన్ని ప్రారంభించిన రాష్ట్రం తమిళనాడు కావడం విశేషం. నాగపట్టణం జిల్లాలోని తిరుక్కువళై ప్రాథమిక పాఠశాలలో ఈ పథకాన్ని సీఎం స్టాలిన్

02

# గ్రీస్ నుంచి బెంగళూరుకు మోడీ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలకు ముందు పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు ఈ పర్యటనను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. ప్రధాని పర్యటనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం ఉదయం 4.30 గంటల నుంచి 9.30 గంటల వరకు ప్రధాని ప్రయాణించే రహదారుల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని బెంగళూరు సిటీ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. ఇస్రో శాస్త్రవేతలతో భేటీ అనంతరం మోదీ ఢిల్లీ బయల్దేరి వెళ్తారు. స్పేస్ సైన్స్ చరిత్రలో చంద్రుని దక్షిణ ధృవంపై భారత్ విజయవంతంగా తన విక్రమ్ రోవర్ ను చేర్చటంలో సఫలం కావటం సంతోషంగా ఉందని ప్రధాని మోదీ అన్నారు. చంద్రయాన్ విజయంతో ఇస్రో శాస్త్రవేత్తలను కృషిని కొనియాడారు. దీంతో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించిందని మోదీ అన్నారు. చంద్రయాన్ సూపర్ సక్సెస్ మరీ కీలకమైన మైలురాయిగా పేర్కొన్న ప్రధాని తన జీవితం ధన్యమైందని అన్నారు. చంద్రయాన్ విజయం దేశం గర్వించే మహత్తరమైన క్షణాలుగా ప్రధాని అభివర్ణించారు. దీంతో ఇండియా ప్రపంచపటంలో కొత్త చరిత్రకు నాంది పలికిందని అన్నారు.ఇది అమృతకాలంలో నెలకొన్న తొలి ఘన విజయం ఇదని ప్రధాని మోదీ వెల్లడించారు. తాను దక్షిణాఫ్రికాలో బ్రిక్స్ సదస్సుకు హాజరైనప్పటికీ తన మనసంతా చంద్రయాన్-3పైనే ఉందని చెప్పారు.

ఈ విజయం దేశం గర్వించే మహోన్నత ఘట్టం. అద్భుత విజయం కోసం 140కోట్ల మంది ఎదురు చూశారన్నారు. చంద్రయాన్-3 బృందం, ఇస్రో శాస్త్ర వేత్తలకు అభినందనలు. ఈ క్షణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూశా'నని అని మోదీ భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. కర్ణాటక ప్రభుత్వం సన్మానంచంద్రయాన్-3 బజ్ ఇంకా కొనసాగుతోంది. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని అన్ని వేదికలపై ప్రజలు ప్రశంసిస్తున్నారు. ప్రపంచ దేశాల్లో తలెత్తుకొనేలా చేసిన ఇస్రో సైంటిస్టులకు ఏం ఇచ్చుకున్నా తక్కువే అంటున్నారు. ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ... ఈ మిషన్‌లో పాల్గొన్న వారంతా మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే అన్నారు. దీంతో వారిపై అభిమానం మరింత పెంచుకుంటున్నారు ప్రజలు. ఒక్క అడుగు ముందుకు వేసిన కర్ణాటక ప్రభుత్వం చంద్రయాన్ -3 విజయంలో భాగమైన వారిని సన్మానించేందుకు సిద్ధమైంది. ఈ మిషన్ కోసం పని చేసిన ఐదు వందల మంది ఇస్రో శాస్త్రవేత్తలను ఘనంగా సత్కరిస్తామని కర్ణాటక సీఎం సిద్ద రామయ్య ప్రకటించారు. ఇస్రో ఆఫీస్‌ను సందర్శించిన ఆయన శాస్త్రవేత్తలను అభినందిచారు. బెంగళూరులోని ఇస్రో హెడ్ ఆఫీస్‌కు వెళ్లిన సిద్ధరామయ్య అక్కడ శాస్త్రవేత్తలను కలిశారు. ఇస్రో ఛైర్మన్ సోమనథ్, ప్రాజెక్టు డైరెక్టర్‌లు వీరముత్తువేల్, కె. కల్పన, యూఆర్ఎస్‌సీ డైరెక్టర్ ఎం శంకరన్‌ను సత్కరించారు. వారు చేసిన కృషిపై ప్రశంసలు కురిపించారు. చందమామ దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను పంపి ప్రపంచ దేశాలకు భారత్ సత్తా చాటినందుకు ఆనందం వ్యక్తం చేశారు సిద్ధరామయ్య. ఇలాంటి సైంటిస్టులకు ఏం ఇచ్చినా తక్కువే అన్నారు. అందుకే 500 మంది శాస్త్రవేత్తలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున సన్మానిస్తామన్నారు. సెప్టెంబర్ 2న కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. సన్మాలే కాకుండా భవిష్యత్‌లో ఇస్రో చేపట్టే కార్యక్రమాలకు పూర్తి స్థాయి మద్దతు ప్రకటించారు సిద్దరామయ్య.

## ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న ఆమెకు షరతులతో కూడిన బెయిల్ రావడంతో ఆమె విడుదల అయ్యారు. జైలు నుంచి బెయిల్‌పై విడుదలయిన తర్వాత సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తి వేసింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ అక్రమాస్తులపై సీబీఐ నమోదు చేసిన 11 కేసులకుగానూ రెండు కేసుల్లో శ్రీలక్ష్మి నిందితురాలిగా ఉన్నారు. దాల్మియా సిమెంట్స్‌లో 5వ నిందితురాలు. అవినీతి నిరోధక చట్టం కింద నమోదు చేసిన 13(2)రెడ్ విత్ 13(1)(సి), (డి)ల కింద విచారణను కొనసాగించవచ్చంది. దీంతోపాటు పెన్నా సిమెంట్స్‌కు కర్నూలులో లీజు మంజూరులో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సీబీఐ అదనపు అభియోగపత్రం దాఖలు చేస్తూ 15వ నిందితురాలిగా పేర్కొంది. కర్నూలు జిల్లాలో 304.74 హెక్టార్ల లీజు మంజూరులో అల్ట్రాటెక్ దరఖాస్తును తిరస్కరించి పెన్నాకు కట్టబెట్టడంలో కీలక పాత్ర పోషించారని సీబీఐ ఆరోపించింది.

## డెంగ్యూకు హైదరాబాదీ వ్యాక్సిన్

(మొదటిపేజీ తరువాయి)

తయారు చేస్తున్న సైంటిస్టులు చెబుతున్నారు. దోమల కారణంగా ప్రబలుతున్న ఈ వ్యాధితో దేశంలో చాలా ప్రాంతాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కరోనా సమయంలో డెంగ్యూ కేసులు తగ్గినప్పటికి 2020-21 మధ 333 శాతం కేసుల పెరగ్గా , 2021-22లో 21 శాతం పెరిగాయి.డెంగ్యూకి చెక్ పెట్టాలనుకున్న సైంటిస్టులు 90 మందిపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించారు. 18-50 ఏళ్ల మధ్య ఉన్న వాళ్లపై ట్రయల్స్ నిర్వహించగా.. వీరిలో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కనబడలేదని సైంటిస్టులు తెలిపారు. అలాగే రెండు మూడేళ్లలో రెండో దశ ట్రయల్స్ జరుగుతాయి. జనవరి 2026 నాటికి దేశ ప్రజలకు డెంగ్యూ వ్యాక్సిన్ అందుబాటు లోకి వచ్చే అవకాశం ఉంది. భారత్‌లోహైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇమ్యూనాలాజికల్స్ లిమిటెడ్ .. ఎఐఒ కంపెనీ డెంగ్యూ వ్యాక్సిన్ తయారు చేస్తోంది. అమెరికాకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ సహకారంతో ఈ టీకా తయారు చేస్తున్నారు. ఎఐఒతో పాటు సీరం ఇనిస్టిట్యూట్ , పనేషియా బయోటిక్ కూడా డెంగ్యూ వ్యాక్సిన్‌ను తయారు చేస్తున్నాయి. ఎఐఒ కంపెనీ 50 దేశాలకు వివిధ రకాల టీకాలను ఎగుమతి చేస్తోంది. రాబీస్ వ్యాక్సిన్ తయారీలో ఈ సంస్థ అగ్రగామిగా ఉంది.

# దేశంలో తొలిసారిగా అల్పాహార పథకం

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. చిన్నారులకు అందించే అల్పాహారాన్ని ఆయన దగ్గరుండి పరిశీలించారు. ఆ తర్వాత పిల్లలకు స్వయంగా బ్రేక్‌ఫాస్ట్‌ను వడ్డించారు. అనంతరం ఆ పాఠశాలలోని చిన్నారులతో కలిసి ముఖ్యమంత్రి స్టాలిన్ అల్పాహారం తిన్నారు. మరోవైపు చెన్నైలోని స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి ఈ పథకాన్ని ప్రారంభించారు. వాస్తవానికి గత ఏడాది సెప్టెంబర్ నెలలోనే ఈ పథకాన్ని స్టాలిన్ సర్కారు ప్రకటించింది. అలాగే ప్రయోగాత్మకంగా ఇప్పటికే 1545 పాఠశాలల్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. చిన్నారులు ఆకలి బాధలు లేకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చూడటంతో పాటు.. వారిలో తీవ్ర ప్రభావం చూపుతున్నటువంటి రక్తహీనతను బాగా తగ్గించడం, పోషకాహార స్థితిని మెరుగుపర్చడం అలాగే పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో డీఎంకే సర్కార్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇటీవల ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ అల్పాహార పథకం విజయవంతమైంది. దీంతో శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 31,008 ప్రభుత్వ పాఠశాలలకు ఈ పథకాన్ని విస్తరించారు. అయితే ఈ పాఠశాలలో మొత్తం 15,75,900 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పుడు వీరందరికీ ఈ అల్పాహార పథకం అందుబాటులోకి వచ్చేసింది. ఇదిలా ఉండగా వాస్తవానికి ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులే ఉంటారు. వీళ్ల కుటుంబంలో ఉదయం పూట వండుకోవడం కూడా చాలా కష్టంగా ఉంటుంది. అయితే ఇప్పుడు అల్పాహార పథకం ప్రారంభించడం వల్ల ఎంతోమంది విద్యార్థులకు మేలు జరగనుంది. ఇకనుంచి విద్యార్థులు ఉదయం పూట పాఠశాలకు వచ్చినప్పుడు అక్కడే అల్పాహారం తీసుకోవచ్చు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంపై చాలామంది ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అలాగే తమ పిల్లలకు పాఠశాలల్లోనే అల్పాహారం అందించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు కూడా చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ పథకం ద్వారా తాము అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని డీఎంకే ప్రభుత్వం భావిస్తోంది.

## తిరుచానూరులో శాస్త్రోక్తంగా శ్రీ వరలక్ష్మీవ్రతం

(మొదటిపేజీ తరువాయి)

అష్టలక్ష్మిమూర్తులతో, రోజాలు, తామరపూలు లాంటి రంగురంగుల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. చెన్నైకి చెందిన దాత విరాళంతో పుష్పాలంకరణ చేపట్టామని ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసులు తెలిపారు. భక్తులందరూ వ్రతాన్ని వీక్షించేందుకు వీలుగా ఆస్థాన మండపంలో 2, పుష్కరిణి వద్ద 1, గంగుంద్ర మండపం వద్ద 1 కలిపి 4 ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

**స్వర్ణరథోత్సవం**

వరలక్ష్మి వ్రతం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు కనువిందు చేయనున్నారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి దంపతులు , జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం దంపతులు, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ కుమార్, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈవో రమేష్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సచివాలయంలో ప్రార్ధనా మందిరాలను ప్రారంభించిన సీఎం, గవర్నర్

**హైదరాబాద్, ఆగస్టు 25**



తెలంగాణ సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆలయ ప్రారంభోత్సవంలో గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన సచివాలయంలో నల్లపోచమ్మ ఆలయాన్ని ఏర్పాటు చేసింది ప్రభుత్వం. . ఈ కార్యక్రమంలో మంత్రులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్, సీఎం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ష్ట్ర సచివాలయం ఆవరణలో దేవాలయం, చర్చి, మసీదుల ప్రారంభోత్సవం జరిగింది. సర్వమత సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు నిర్మించిన ప్రార్ధనా మందిరాలను గవర్నర్ తమిళిసైతో కలిసి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. నల్లపోచమ్మ ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం మసీదును ప్రారంభించారు. ఈ సందర్భంగా నమాజ్ చేశారు. నిన్న గవర్నర్‌తో భేటీ అయిన సందర్భంగా ఆలయాల ప్రారంభోత్సవానికి రావాలని సీఎం కేసీఆర్ కోరారు. దీనికి గవర్నర్ తమిళిసై అంగీకరించారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో గవర్నర్ తమిళిసై ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఒకే వేదికపై చాలా కాలం తరువాత సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళి సై కనిపించడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. తెలంగాణ సచివాలయం నిర్మాణ సమయంలో నల్లపోచమ్మ గుడి, మసీదు, చర్చిలను తొలగించారు. కొత్త సచివాలయంలో ప్రభుత్వం ఈ మూడు ప్రార్ధనా మందిరాలను నిర్మించింది. సచివాలయానికి నైరుతి దిశలో నల్ల పోచమ్మ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంతో పాటు గణపతి, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను కూడా నిర్మించారు. మునుపటి స్థలంలో మసీదులు నిర్మించబడ్డాయి. ఈ మసీదుల సమీపంలో చర్చి కూడా నిర్మించబడింది. ఇవాళ నల్లపోచమ్మ ఆలయ పూర్ణాహుతి కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. సర్వమత ప్రార్థనల్లో కేసీఆర్, గవర్నర్ పాల్గొన్నారు. చాలా రోజుల తర్వాత కేసీఆర్, గవర్నర్లు ఒకే వేదికపై పాల్గొన్నారు.నల్ల పోచమ్మ ఆలయంలో గవర్నర్, సీఎం ప్రత్యేక పూజలు నిర్వహించి చర్చిని ప్రారంభించారు. చర్చిలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం కేసీఆర్ కేక్ కట్ చేశారు. మసీదును ప్రారంభించిన అనంతరం గవర్నర్, సీఎం ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదు ప్రారంభోత్సవంతో పాటు అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీలు కూడా ప్రార్థనల్లో పాల్గొన్నారు. నిన్న సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో సీఎం కేసీఆర్ భేటీ అయ్యారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పట్నం మహేందర్ రెడ్డి సీఎం కేసీఆర్‌ను కలిశారు. పెండింగ్ బిల్లులు, ఎమ్మెల్సీల గవర్నర్ కోటాపై చర్చించినట్లు సమాచారం. అయితే అదే సమయంలో ఈరోజు తెలంగాణ సచివాలయంలో ప్రార్థనా మందిరాల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా గవర్నర్‌ను సీఎం కేసీఆర్ ఆహ్వానించారు. సీఎం ఆహ్వానం మేరకు ఇవాళ తెలంగాణ సచివాలయంలో ప్రార్థనా మందిరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పాల్గొన్నారు.. సచివాలయం ఉద్యోగులు టెంపుల్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. గవర్నర్ తమిళిసై. దేవాలయ ప్రారంభోత్సవంలో గవర్నర్ పాల్గొన్నారు. నిన్న గవర్నర్‌తో భేటీ అయిన సందర్భంగా ఆలయాల ప్రారంభోత్సవానికి రావాలని కోరారు సీఎం కేసీఆర్. ఇందుకు గవర్నర్ తమిళిసై అంగీకరించారు. ఉదయం వరలక్ష్మి వ్రతం సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి టెంపుల్‌లో ప్రత్యేక పూజలు చేశారు గవర్నర్ తమిళిసై

# మా సీఎం అభ్యర్ధి కేసీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 25**

బీఆర్ఎస్ సీఎం అభ్యర్థి కేసీఆర్ అని, మరి మీ సీఎం అభ్యర్థి ఎవరో చెప్పాలని కాంగ్రెస్, బీజేపీ పార్టీలను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. వ్యవసాయానికి మూడు గంటలు మాత్రమే కరెంట్ చాలంటున్న కాంగ్రెస్ కావాలా లేదా 24 గంటల నిరంతర విద్యుత్తు అందిస్తున్న సీఎం కేసీఆర్ కావాలా అన్నది రైతులు ఆలోచించుకోవాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్ల పెట్టమంటున్నదని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనలకు రూ. 15 లక్షల రుణమాఫీ చేసిన బీజేపీ ప్రభుత్వం రైతు రుణమాఫీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు.ఆర్మూర్ కార్యకర్తల సమావేశంలో పాల్గొనడానికి విచ్చేసిన కవిత పెర్కిట్ చౌరస్తాలో బీఆర్ఎస్ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. మూడో సారీ ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి టికెట్ పొందిన తర్వాత మొదటి సారి జీవన్ రెడ్డి ఆర్మూర్ కు వచ్చారని, ఆయనను ఆశీర్వదించడానికి వచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. 2014లో మొదటి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించుకున్నామని గుర్తు చేశారు. "ఏ ఫర్ ఆర్మూర్ , ఏ ఫర్ ఆశన్నగారి జీవన్ రెడ్డి" అని వ్యాఖ్యానించారు. 2014లో మొదటిసారి ఎమ్మెల్యే గా గెలపొంది జీవోల జీవన్ రెడ్డిగా పేరు తెచ్చుకున్నారని, రెండో సారి 30 వేల మెజారిటీతో ప్రజలు ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు. ఇప్పుడు ముచ్చటగా మూడో సారి సీఎం కేసీఆర్ టికెట్ ఇచ్చారని, ఈ సారి కచ్చితంగా 60 వేల మెజారిటితో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గత ఏడాదిన్నర కాలం నుంచి జీవన్ రెడ్డి సీఎం కేసీఆర్ తోనే ఉంటున్నారని, నీడలాగా నిరంతరం సీఎంతో కలిసి పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. అలాగే, ఆకుల లలిత పార్టీలో చేరిన తర్వాత ఆమెను గౌరవించుకున్నామని, ఆమెకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు ఇస్తామని స్పష్టం చేశారు. జీవన్ రెడ్డిని ఆశీర్వదించిన ఆకుల లలిత మరింత ఉన్నత స్థానంలో ఉంటారని తెలిపారు.ఆలూరు, డొంకేశ్వర్ ను మండల కేంద్రంగా చేశామని, ఆర్మూర్ ను రెవెన్యూ డివిజన్ చేసుకున్నామని వివరించారు. చెప్పిన ప్రతీ ఒక్కటి చేసుకుంటూ వచ్చామని, చెప్పిన పని చేస్తూ నిరంతరం అభివృద్ధికి కృషి చేస్తున్నాము కాబట్టి ఒక హక్కుతోప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడగాలని కార్యకర్తలకు దిశానిర్ధేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏవేవో పెద్ద మాటలు మాట్లాడుతున్నారని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యవసాయానికి కేవలం మూడు గంటల విద్యుత్తు సరిపోతుందని అంటున్నారని, మూడు గంటల కరెంట్ సరిపోతుందా అని ప్రశ్నించారు. మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలా లేదా 24 గంటల నిరంతర కరెంట్ ఇస్తున్న కేసీఆర్ కావాలా అన్నది ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్ వాళ్లేమో మూడు గంటల కరెంట్ చాలంటే? బీజేపీ వాళ్లేమో మోటార్లకు మీటర్లను పెట్టమంటున్నారని విమర్శించారు.

దాదాపు రూ. 15 లక్షల కోట్ల మేర కార్పొరేట్ కంపెనీలకు రుణాలను మాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు ఒక్క రూపాయి కూడా రుణమాఫీ చేయలేదని స్పష్టం చేశారు. బీజేపీ మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తసుకొస్తే వాటిపై జరిగిన పోరాటంలో 850 మంది రైతులు మరణిస్తే వాటిని వెనక్కి తీసుకున్నారని గురుచేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మనకు దోస్తుకాదని, ప్రజలతో కొనసాగే ఒకఒకే వ్యక్తి సీఎం కేసీఆర్ అని, ఒకే ఒక పార్టీ బీఆర్ఎస్ అని తేల్చిచెప్పారు. "మా ముఖ్యమంత్రి అభ్యర్థి కేసీఆర్? మరి మీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరు ?" అని కాంగ్రెస్, బీజేపీ పార్టీలను ప్రశ్నించారు. 2014లో ప్రజలకు తమ పార్టీకి 63 సీట్లు ఇచ్చారని, 2019లో 88 సీట్లు ఇచ్చారని, ఈ ఎన్నికల్లో కచ్చితంగా 100కుపైగా ఎమ్మెల్యే సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మరొక్కసారి సీఎం కేసీఆర్ ను, జీవన్ రెడ్డిని ఆశీర్వదించాలని ఆర్మూర్ రైతన్నలకు విజ్ఞప్తి చేశారు.ఎర్రజొన్నలకు సంబంధించి 2007లో రైతులకు మోసం జరిగితే ధర్నా చేస్తున్న రైతుల మీద అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాల్పులు జరిపిందని, చాలా మంది రైతులు గాయపడ్డారని వివరించారు.

# మంత్రి ఉష శ్రీచరణ్ నుఅడ్డుకున్న నిర్వాసితులు

**అనంతపురం**

అనంతపురం జీడిపల్లి జలాశయం నుంచి కుందుర్పి బ్రాంచి కెనాల్ కాలువ నిర్మాణానికి భూములిచ్చిన తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతులు రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి ఉష శ్రీచరణ్ కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. కుందుర్పి మండలంలోని కుందుర్పి, అపిలేపల్లి, మలయనూరు గ్రామాల్లో సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించేందుకు మంత్రి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో భూ నిర్వాసిత పోరాట సమితి జిల్లా కార్యదర్శి రాహుల్‌తోపాటు బాధిత రైతులు మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. కళ్యాణదుర్గం పట్టణ సీఐ తేజోమూర్తి, కుందుర్పి ఎస్ఐ కృష్ణమూర్తి సిబ్బందితో రైతులను అడ్డుకొన్నారు. కాన్వాయ్‌ను అక్కడి నుంచి పంపించేశారు. మంత్రికి కనీసం వినతి పత్రం ఇవ్వనీయ్యకుండా చేయడంతో రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. రాహుల్‌ను పోలీసులు బలవంతంగా కారులో ఎక్కించుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అతనిపై కేసు నమోదు చేశారు.అనంతరం సొంత పూచీకత్తుపై వదిలివేశారు. జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే భూనిర్వాసితుల సమస్యలు రెండేళ్లలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని రాహుల్, బాధిత రైతులు ఆరోపించారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వారు స్పష్టం చేశారు.

# దూకుడు పెంచిన బీజేపీ....

**విజయవాడ, ఆగస్టు 25:**

ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతాపార్టీ దూకుడు పెంచింది.రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు ఆ పార్టీ నేతలు.పురంధేశ్వరి రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే సర్కార్ పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు.రాష్ట్ర అప్పుల విషయంలో ప్రభుత్వ తీరును తప్పుపడుతూ వస్తున్నారు.అక్కడితో ఆగలేదు సరికదా ఢిల్లీ వెళ్లి మరీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ను కలిసి ప్రభుత్వంపై ఫిర్యాదు చేసారు.ఎఫ్ ఆర్ బీఎం పరిమితులకు మించి భారీగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు పురంధేశ్వరి.నేరుగా తీసుకున్న అప్పులు కాకుండా కార్పొరేషన్ ల పేరుతో లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ.దీంతో పాటు కేంద్రం ఇస్తున్న నిధులను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పేరు లేకుండా సంక్షేమం పేరుతో భారీగా అప్పులు చేయడం,నిధులు పక్కదారిపట్టడంపై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామంటున్నారు బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి.ఇప్పటికే చేస్తున్న ఆరోపణలకు తోడు మరింతగా స్వరం పెంచారు.వాలంటీర్ల ద్వారా హైదరాబాద్ కేంద్రంగా ఓట్ల తొలగింపు చేస్తున్నారంటూ ఏపీ సర్కార్ పై మండిపడుతున్నారు పురంధేశ్వరి.ఓట్ల తొలగింపు పై త్వరలో ఈసీకి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.అవకాశం దొరికినప్పుడల్లా ఏపీ సర్కార్ పై ఆరోపణలు,విమర్శలు చేస్తూ దూకుడుగా ముందుకెళ్తున్నారు బీజేపీ నేతలు.భారతీయ జనతాపార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ కార్యవర్గంలో భారీగా మార్పులు చేసారు పురంధేశ్వరి.గతంలో సోము వీర్రాజు అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కీలక పదవుల్లో ఉన్న వారిని చాలామందిని పక్కకు తప్పించడంతో పాటు కొంతమంది నేతలకు వేరే బాధ్యతలు అప్పగించారు. సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేస్తూ పార్టీ బలోపేతానికి కష్టపడే నేతలను తన టీంలోకి తీసుకున్నారు.ఇప్పటికే ఆయా రాష్ట్ర స్థాయి నేతలు ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు.ఓవైపు పురంధేశ్వరి తో పాటు జాతీయ స్థాయి నేతలు కూడా ఏపీ సర్కార్ ను తీవ్రంగా తప్పుపడుతున్నారు.ఓటర్ చేతన్ మహాభియాన్ కార్యక్రమంలో ఏపీ నేతలతో కలిసి వర్చువల్ గా పాల్గొన్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కూడా సర్కార్ పై తీవ్ర ఆరోపణలు చేసారు. తాగుబోతులను తాకట్టు పెట్టి అప్పులు చేస్తున్న ప్రభుత్వం ఒక్క ఆంధ్రప్రదేశ్ అంటూ విమర్శించారు బండి సంజయ్? అవినీతి,అప్పుల్లో కూరుకుపోయిన ఏపీ ప్రభుత్వం.. దొంగ ఓట్లతో మళ్లీ గెలిచేందుకు కుట్ర చేస్తుందంటూ ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి కేవలం కేంద్ర ఇస్తున్న నిధులతోనే జరుగుతుందని అంటున్నారు. రాష్ట్రంలో అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించాల్సిన సమయం ఆసన్నమైందంటూ బండి సంజయ్ ఏపీ నేతలకు పిలుపునిచ్చారు.ఏపీలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 10 వేల ఓట్లకుపైగా నకిలీ ఓట్లను నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారని.. కేంద్ర ఎలక్షన్ కమిషన్ ఈ విషయంపై చాలా సీరియస్ గా ఉందన్నారు సంజయ్. మొత్తానికి ప్రధాన ప్రతిపక్షంతో సమానంగా ఏపీ ప్రభుత్వంపై విమర్శల దాడిని పెంచేసారు బీజేపీ నేతలు. రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాల ద్వారా ప్రభుత్వంపై ఆందోళనలు నిర్వహించేందుకు సిద్దమవుతున్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రకార్యవర్గంలో మార్పులు చేసుకుని తన సొంత టీంను ఏర్పాటుచేసుకున్న పురంధేశ్వరి రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.ఇప్పటికే కేంద్రం ఇస్తున్న స్థానిక సంస్థల నిధులను ఏపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందంటూ అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు?ఇదే అంశంపై రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను కలిసి ఫిర్యాదు కూడా చేసారు.స్థానిక సంస్థల నిధులు పక్కదారి పట్టడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిపోతుందంటూ ఫిర్యాదు చేసారు.కేంద్రం ఇచ్చిన నిధులు సర్పంచ్ ల ఖాతాలకు పంపేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్ ను కోరారు.ఇదే రకంగా ఓట్ల తొలగింపు అంశంపైనా పెద్ద ఎత్తున ఆందోళన చేసేలా ముందుకెళు _న్నారు.ఇలా ఒక్కో ప్రజా సమస్యను తీసుకుని వాటిపై ఆందోళనలు నిర్వహించడం,సంబంధిత అధికారులు లేదా కేంద్రానికి ఫిర్యాదు చేయడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా కార్యాచరణ రూపొందించే పనిలో పడ్డారు. మొత్తానికి ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో బలపడేందుకు బీజేపీ గట్టి ప్రయత్నాలే చేస్తోంది.

# సీతారామ్ స్థానంలో సత్యవతి

**శ్రీకాకుళం, ఆగస్టు 25:**

ఏపీలో ఎన్నికల కాక పెరిగింది. ముఖ్యంగా అధికార వైసీపీలో పార్టీ టికెట్ల లొల్లి ఆ పార్టీకి మొదటికే మోసం తెచ్చేదిగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న అధికార వైసీపీ.. దానిని అధిగమించడానికి పేరుగొప్ప ఎమ్మెల్యే పదవి తప్ప.. ఇంకే ప్రాధాన్యతా లభించక ఇంత కాలం లోలోపలే ఆవేదనతో మగ్గిపోయిన ఎమ్మెల్యేలపైనే వేటు వేయాలని భావిస్తున్నది. ఆ విషయంలో వైసీపీ ఎటువంటి తారతమ్యాలకూ చోటివ్వడం లేదు. మంత్రులు కూడా పార్టీ టికెట్ విషయంలో గ్యారంటీ లభించక ఏం జరుగుతుందో? ఏం జరిగితే ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో మధనపడుతున్నారు. అలా వచ్చే ఎన్నికలలో పార్టీ టికెట్ దక్కదు అన్న వారి జాబితాలో దాదాపు మొదటి పేరుగా స్పీకర్ తమ్మినేని సీతారాం పేరు గట్టిగా వినిపిస్తోంది. శ్రీకాకుళం జిల్లాలోని ఆముదాలవలసలో మరో సారి వైసీపీ జెండా ఎగురవేయాలంటే.. ఆ స్థానంలో కొత్త ముఖాన్నీ పోటీలో నిలబెట్ట డమొక్కటే మార్గమన్న నిశ్చితాభిప్రాయానికి పార్టీ అధినేత జగన్ వచ్చేశారని అంటున్నారు. అందుకోసం సమర్థులైన అభ్యర్థి కోసం గాలిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఈసారి సీటు దక్కడం దాదాపు అసాధ్యం అంటున్నారు. ఆయన పట్ల నియోజకవర్గ ప్రజలలోనే కాదు, వైసీపీ క్యాడర్ లో కూడా పూర్తి వ్యతిరేకత వ్యక్తమౌతోం దంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ముఖాన్ని బరిలోకి దించితే తప్ప ఆముదాలవలస నియోజకవర్గంలో కనీస పోటీ అయినా ఇచ్చే పరిస్థితి ఉండదని వైసీపీ శ్రేణులు బాహాటంగానే చెబుతున్నాయి.దీంతో ఆ స్థానంలో వైసీపీ జెండా మరోసారి ఎగరేయాలంటే అందుకు సమర్థుడైన, బలమైన అభ్యర్థిని రంగంలోకి దించడమొక్కటే మార్గమని జగన్ నిర్ణయానికి వచ్చేశారనని పార్టీ శ్రేణులు అంటున్నాయి. దీంతో ఆయన చూపు బోడేపల్లి వారసులపై పడిందని అంటున్నారు. జిల్లా రాజకీయాలను దశాబ్దాల పాటు శాసించిన దివంగత బొడ్డేపల్లి రాజగోపాలరావు శతజయంతి వేడుకలను ప్రభుత్వం ఇటీవల అధికారికంగా నిర్వహించడం వెనుక ఆయన వారసులను పార్టీలోకి ఆహ్వానించి ఆముదాల వలస నుంచి పార్టీ అభ్యర్థిగా నిలబెట్టే వ్యూహం ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. బొడ్డేపల్లి రాజగోపాల్ కోడలు బొడ్డేపల్లి సత్యవతిని వైసీపీలో చేర్చుకునేందుకు జగన్ ప్రయత్నాలు ప్రారంభించారని చెబుతున్నారు. బోడేపల్లి వారసురాలిగా సత్యవతి 2004, 2009 ఎన్నికలలో ఆముదాల వలస నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. విభజన అనంతరం 2014, 2019లలో అదే స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగి పరాజయం పాలయ్యారు.వరుసగా రెండు పరాజయాల తరువాత కూడా బోడేపల్లి సత్యవతి కాంగ్రెస్ ని వీడకుండా ఆ పార్టీకి ఆముదాలవలసలో పెద్ద దిక్కుగా ఉన్నారు. ఆమె ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ బాధ్యతలను చూస్తున్నారు. 2024 ఎన్నికల్లో కూడా ఆమె ఆముదాలవలస నుంచి పోటీ చేస్తారని తెలుస్తోంది. అయితే ఆమెను కాంగ్రెస్ నుంచి వైసీపీలోకి తీఎసుకుని రావడం ద్వారా 2024 ఎన్నికలలో లబ్ధి పొందాలని వైసీపీ అధినేత భావిస్తున్నారు. అందులో భాగంగానే బోడేపల్లి రాజగోపాల్ శతజయంతి వేడుకలను అధికారికంగా ప్రభుత్వం నిర్వహించిందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే వైసీపీ బొడ్డేపల్లి సత్యవతితో సంప్రదింపులు జరిపినట్లు విశ్వసనీయంగా తెలుస్తున్నది. ఇక పోతే బోడేపల్లి సత్యవతి వైసీపీ గూటికి చేరడం అంటూ జరిగితే.. తమ్మినేని తిరుగుబాటు చేయడం ఖాయమని అంటున్నారు. ఎందుకంటే తమ్మినేని ఇప్పటికే ఆముదాలవలస టికెట్ తన కుమారుడికి ఇవ్వాలని అధిష్ఠానాన్ని డిమాండ్ చేసినట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వైసీపీ వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయన్నది చూడాల్సి ఉందని పరిశీలకులు అంటున్నారు.

# జనసేన, బీజేపీ కలిసే పోటీ...

**గుంటూరు, ఆగస్టు 25 :**

మా రెండు పార్టీలు మిత్రపక్షాలే. ఆంధ్రప్రదేశ్ లో మేము కలిసే ఎన్నికలకు వెళ్తాం.. బీజేపీ నేతలు పదేపదే చెబుతున్న మాటలివి. జనసేనతో తమ పొత్తు కొనసాగుతుందని చెప్పుకొస్తున్నారు. భారతీయ జనతాపార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పురంధేశ్వరి కూడా ఇదే విషయాన్ని చెప్పుకొస్తున్నారు. కానీ ఎక్కడా రెండు పార్టీల అధినేతలు కలిసింది లేదు. గతంలో సోము వీర్రాజు ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జనసేనతో గ్యాప్ ఎక్కువగానే ఉండేది.ఎక్కడా రెండు పార్టీలు కలిసి ఉద్యమాలు చేసిన దాఖలాలు కూడా లేవు.ప్రస్తుతం ఇరు పార్టీల అధ్యక్షులు కలవకపోయినా కొన్ని విషయాల్లో మాత్రం క్యాడర్ తో కలిసి పనిచేయాలని నిర్ణయానికి వచ్చాయి. మొదటి నుంచీ మిత్రపక్షం ప్రస్తావన బీజేపీ నేతలే తీసుకొస్తున్నారు. అయితే ఇటీవల స్థానిక సంస్థల నిధులు మళ్లింపు,సర్పంచ్ ల సమస్యలపై ప్రభుత్వ తీరుపై రెండు పార్టీలు ఆందోళనలు నిర్వహించాయి. జిల్లా కేంద్రాల వద్ద జరిగిన ధర్నాల్లో బీజేపీ నాయకులతో కలిసి జనసేన కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.సుమారు మూడేళ్లుగా కలిసి పోరాటాలు చేయని రెండు పార్టీలు మొదటిసారి ఒకే వేదికపై ఆందోళనకు దిగాయి. ఇకపై జనసేతో కలిసి ఉద్యమాలు చేయాలని విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో పార్టీ కేడర్ కు పిలుపునిచ్చారు పురంధేశ్వరి.భారతీయ జనతాపార్టీ-జనసేన కలిసి ఉద్యమాలు చేసేలా పురంధేశ్వరి కేడర్కు పిలుపునిచ్చారు. ఇదే సమయంలో ఎవరికి వారు సొంతంగా బలపడాల్సిన అవసరం ఉంది కాబట్టి అంశాల వారీగా కలిసి ఉద్యమాలు చేయాలని పురంధేశ్వరి సూచించారు.ఇప్పటికే కేంద్రప్రభుత్వం గ్రామపంచాయతీలకు విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందంటూ బీజేపీ పదేపదే ఆరోపణలు చేస్తోంది.సర్పంచ్ ల సంఘం నేతలు పురంధేశ్వరి కలిసి తమగోడు విన్నవించుకున్నారు .అటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను కూడా కలిసి సమస్యలు చెప్పుకొన్నారు సర్పంచ్ లు.దీంతో ఈ సమస్యపై రెండు పార్టీలు కలిసి ఆందోళనకు పిలుపునిచ్చాయి.ఇదే విధంగా భవిష్యత్తులో కూడా కొన్ని అంశాలపై పోరాటాలు చేయాలని పురంధేశ్వరి సూచించారు. ప్రజా సమస్యలతో పాటు తమ వద్దకు వచ్చే అంశాలను పరిగణనలోకి తీసుకుని జిల్లా స్థాయిలో లేదా రాష్ట్ర స్థాయిలో ఆందోళనలు నిర్వహించేలా పురంధేశ్వరి కేడర్ ను సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర కార్యవర్గంలో మార్పులు చేసిన పురంధేశ్వరి.. జిల్లాల కార్యవర్గాల్లో కూడా మార్పులు చేర్పులు చేయడం ద్వారా క్షేత్రస్థాయిలో మరింత దూకుడుగా ముందుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు.ఎన్నికలు సమీపిస్తున్న వేళ?ప్రభుత్వంపై మరింత దూకుడుగా ఆందోళనలు చేసేలా రెండు పార్టీలు ముందుకెళ్తున్నాయి.జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తో పాటు బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి కూడా కొన్ని కామన్ సమస్యలను ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు.రాష్ట్ర అప్పులు,కరెంట్ చార్జీల పెంపు,ఓట్ల తొలగింపు,వాలంటీర్ల వ్యవస్థ వంటి అంశాలను ఇరు పార్టీల అధినేతలు ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు.అవకాశం దొరికినప్పుడల్లా ఇలాంటి కీలక అంశాలపై ప్రభుత్వాన్ని ఎక్కువగా ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికే పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ద్వారా ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేస్తుంటే?పురంధేశ్వరి కూడా తనదైన స్టైల్ లో ఆరోపణలు కొనసాగిస్తున్నారు.ఇక రెండు పార్టీలు కలిసి ఆందోళనలు చేయడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచవచ్చునే ఆలోచనలతోనే కలిసి వెళ్లాలని నిర్ణయించారట.రెండు పార్టీలు కలిసి చేసే ఉద్యమాలపై త్వరలో ఓ క్లారిటీ ఇవ్వనున్నట్లు సమాచారం.మొత్తానికి ఏపీ ప్రభుత్వం టార్గెట్ గా బీజేపీ,జనసేన ముందుకెళ్తుండటంతో రాజకీయంగా చర్చకు దారితీసింది.

# దుమ్మురేపిన ప్రజ్ఞానంద

**చెన్నై, ఆగస్టు 25 :**

చెస్ ప్రపంచకప్ ఫైనల్‌లో గ్రాండ్‌మాస్టర్ రమేశ్ ప్రజ్ఞానందపై నార్వేకి చెందిన మాగ్నస్ కార్ల్సన్ విజయం సాధించాడు. గురువారం జరిగిన టై బ్రైకర్‌లో మొదటి గేమ్‌ని కార్ల్సన్ గెలుచుకోగా, రెండో మ్యాచ్ డ్రా అయింది. ఫలితంగా తమిళనాడుకు చెందిన గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందపై వరల్డ్ నంబర్. 1 కార్ల్సన్ గెలిచి విజేతగా నిలిచాడు. అలాగే ప్రజ్ఞానంద చెస్ వరల్డ్ కప్ ఫైనల్‌లో రన్నరప్‌గా మిగిలాడు. అంతకుముందు ఫైనల్‌లో భాగంగా జరిగిన తొలి గేమ్.. బుధవారం జరిగిన రెండో గేమ్ డ్రా కావడంతో వరల్డ్‌కప్ ఫైనల్ విజేత ఎవరో తేల్చేందుకు ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ టై బ్రేకర్ గేమ్‌లను నిర్వహించింది. చెస్ వరల్డ్‌కప్ ఫైనల్‌లో ఈ యువ గ్రాండ్‌మాస్టర్ ఓడినప్పటికీ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఫైనల్ ఆడిన రెండో భారతీయుడిగా నిలిచాడు. ఇంతే కాదు, ఇప్పటివరకు చెస్ వరల్డ్ కప్ ఫైనల్ అడిన అత్యంత పిన్న వయస్కుడిగా కూడా ప్రజ్ఞానంద(18) రికార్డుల్లో నిలిచాడు. అలాగే వచ్చే ఏడాది జరిగే 'కేండిడేట్స్ టోర్నీ'కి అర్హత సాధించిన ప్రజ్ఞానంద.. ఈ ఘనత సాధించిన మూడో పిన్న వయస్కుడిగా కూడా నిలిచాడు. చెస్ ప్రపంచకప్ ఫైనల్‌లో ప్రజ్ఞానంద విజయం సాధించిన మాగ్నస్ కార్ల్సన్, అమెరికా చెస్ దిగ్గజం బాబీ ఫిషర్ పదహారేళ్ల వయసులోనే కేండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ప్రజ్ఞానంద తమిళనాడులోని చెన్నైలో జన్మించాడు. తండ్రి రమేష్ బాబు రాష్ట్ర ప్రభుత్వ సహకార బ్యాంకులో ఉద్యోగం చేస్తుంటారు. పోలియో కారణంగా వైకల్యానికి గురైన రమేష్ బాబు తన అర్థిక ఇబ్బందుల నడుమనే ప్రజ్ఞానందకు చిన్నప్పటి నుంచి కూడా చెస్ ఆడేందుకు ప్రోత్సాహం అందించేవారు. ప్రజ్ఞానంద చెస్ టోర్నీలకు వెళ్తున్నప్పుడు అతని వెంట తల్లి నాగలక్ష్మి, అక్క వైశాలి వెంట ఉండేవారు. ప్రజ్ఞానంద తన అక్క కంటే నాలుగేళ్లు చిన్నవాడని, వైశాలి నుంచే అతను చెస్ మెలకువలు నేర్చుకున్నాడని, ఆమెను ఓడించాలని చెస్ ఆడడం అలవరచుకున్నాడని రమేష్ బాబు 2018లో ప్రజ్ఞానంద గ్రాండ్‌మాస్టర్ అయిన సందర్భంగా తెలిపారు. ప్రజ్ఞానంద చెస్ ప్రస్థానం గురించి చూస్తే.. 10 ఏళ్ల వయసులోనే ఇంటర్నేషనల్ మాస్టర్‌గా అవతరించాడు. విశేషం ఏమిటంటే.. ఆ ఘనత సాధించిన అత్యంత పిన్నవయస్కుడు ప్రజ్ఞానందనే. ఈ క్రమంలోనే 12 ఏళ్లకు గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించి, ఆ ఘనత సాధించిన రెండో పిన్న వయస్కుడిగా రికార్డుల్లో నిలిచాడు. ప్రజ్ఞానంద కంటే ముందు ఉక్రెయిన్‌కి చెందిన సెర్గీ కర్జాకిన్ అత్యంత యువ గ్రాండ్‌మాస్టర్‌గా ఉన్నాడు.తాజాగా జరిగిన చెస్ ప్రపంచకప్ ఫైనల్‌లో మార్లన్ గెలవడంతో రన్నరప్‌గా నిలిచిన ప్రజ్ఞానంద 2022లోనే ప్రస్తుత ప్రపంచ చాంపియన్‌ని ఓడించాడు. ఆన్‌లైన్ ఎయిర్‌థింగ్స్ మాస్టర్స్‌లో మాగ్నస్‌ని ఓడించిన ప్రజ్ఞానంద.. అతన్ని ఓడించిన మూడో భారతీయుడిగా కూడా నిలిచాడు. మాగ్నస్‌ని ప్రజ్ఞానంద కంటే ముందు విశ్వనాథన్ ఆనంద్, పెంటాల హారికృష్ణ ఓడించారు.కాగా, ప్రజ్ఞానంద చెస్ ప్రపంచ కప్ ఫైనల్‌లో రన్నరప్‌గా నిలవడంపై చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ స్పందించాడు. ప్రజ్ఞానంద చెస్ ఆటతో మళ్లీ పుంజుకోగలడని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశాడు.

# మంథని మహాలక్ష్మి ఆలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

**-పసుపు కుంకుమలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**-వాయినాలు ఇచ్చిపుచ్చుకున్న మహిళలు**

**మంథని**

శ్రావణ మాసంలో రెండో శుక్రవారాన్ని వరలక్ష్మి శు క్రవారంగా భావించి వరలక్ష్మి వ్రతాలను ఆచరిస్తుంటారు.ఈ సందర్భంగా మంథని పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయానికి భక్తులు వేలాదిగా పోటెత్తారు. వేకువజాము నుంచే మహిళలు పసుపు, కుంకుమలు, పూలమాలలు, మంగళహారతులు చేతబట్టి ఆలయానికి చేరుకొని కొంగుబంగారమైన మహాలక్ష్మి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలలో, కుంకుమ పూజలలో వేలాదిగా మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ వెనుక భాగంలో ఉన్న రావుల చెరువులో అమ్మవారి స్వరూపమైన తామర పూలు భక్తులను ప్రత్యేకంగా ఆకర్షించాయి. వరలక్ష్మి వ్రతం సందర్భంగా మంథని పట్టణంలోనిప్రతి ఇల్లు వ్రత శోభను సంతరించుకున్నాయి. శ్రావణమాసం రెండో శు క్రవారం సందర్భంగా ఈ పూజలు నిర్వహించటం సంప్రదాయంగా వస్తోంది. తమ సౌభాగ్యాన్ని కాపాడాలని, కోరిన వరాలు ఇవ్వాలని వరలక్ష్మిదేవి రూపంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారిని పూజించుటం




వరలక్ష్మి వ్రతం యొక్క ప్రత్యేకత. గతంలో కలశాన్ని అమ్మవారి రూపంగా భావించి పూజలు నిర్వహించేవారుకానీ ఇప్పుడు అమ్మవారి ముఖ ప్రతిమను ఆధారంగా చేసుకుని వరలక్ష్మిదేవి రూపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇత్తడి బిందెలు, కలశాల సాయంతో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కొబ్బరికాయకు వరలక్ష్మిదేవి ముఖాన్ని జోడించి అమ్మవారి రూపును తమ ఇళ్లలో కొలువుదీర్చి భక్తితో మురిసిపోతున్నారు మహిళలు. నిండు ముత్తయిదువలా తయారైన వరలక్ష్మిదేవికి స్వర్ణాభరణాలు జోడించి తన్మయత్వంచెందుతున్నారు. ఆ తర్వాత వరలక్ష్మి వ్రత కథను పఠించి శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం తోటి ముత్తయిదువలకు పసుపు, కుంకుమలు ఇచ్చి వారి నుంచి ఆశీర్వాదాలు పొందారు. ముత్తయిదువ మహిళలను ఇళ్లకు ఆహ్వానించితాంబూలంతో కూడిన వాయినం ఇవ్వటం ద్వారా వరలక్ష్మి వ్రతాన్ని పూర్తి చేసుకున్నారు. దేవాలయంలో దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాలయ సిబ్బంది చర్యలు చేపట్టారు. ఆలయ అర్చకుడు మారుపాక ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలను నిర్వహించారు. దేవాలయం వద్ద ఎలాంటి అవంచనీయ సంఘటనలు జరగకుండా మంథని సెకండ్ ఎస్సై రాణి వర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆత్మాభిమానం వుంటే ఆ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయాలి

**హైదరాబాద్**

కాంగ్రెస్ నుండి టి ఆర్ ఎస్ లోకి చేరిన ఎమ్మెల్యే లను కుక్కలుగా కెసిఆర్ వర్ణించినట్టు తెలంగాణ రైతు బంధు అధ్యక్షులు పల్లా రాజేశ్వర్ రెడ్డి గురువారం చేసిన వ్యాఖ్యలు కెసిఆర్ దుర్బుద్ధిని, ప్రతి పక్షాలను కాలరాచే అహంకార ధోరణిని స్పష్టం చేస్తున్నాయని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ విమర్శించారు. ప్రశ్నించే వారిని సహించకుండా గత 9 ఏళ్లుగా ఆయన చేస్తున్న నిరంకుశ పరిపాలనకు చరమగీతం పడాల్సిన సమయము ఆసన్న మైనది. బలమైన ప్రతిపక్ష ముంటేనే ప్రజాస్వామ్యము వర్ధిల్లుతుంది. కేసీఆర్ లాంటి వారు ప్రజాస్వామ్యానికి చీడ పురుగులు. కాంగ్రెస్ తో సహా ఇతర పార్టీల నుండి భారాస లోకి చేరిన ఎమ్మెల్యేలకు ఆత్మాభిమానముంటే బారాస కు రాజీనామా చేసి తమలో చీము, నెత్తురు ఉందని నిరూపించుకోవాలి. లేదంటే ప్రజలే వచ్చే ఎన్నికలలో వారిని చిత్తుచిత్తుగా ఓడిస్తారని అయన అన్నారు.

## డివైడర్ ను ఢీకొట్టిన బైకు

### ఒకరు మృతి..మరోకరికి తీవ్ర గాయాలు

**అన్నమయ్య**
అన్నమయ్య జిల్లా కురబలకోట మండలంలో శుక్రవారం వేకువ జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాత పడగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గాలివీడు మండలం, అరవీడుకు చెందిన రాజగోపాల్ రెడ్డి, స్నేహితుడు రమణ కలసి సొంత పని పైన మదనపల్లి కు బైకులో వస్తుండగా మార్గ మధ్యంలోని కురబలకోట మండలం, ముదివేడు సమీపాన వున్న కడప క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోయి బైకు అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టింది.. రాజగోపాల్ రెడ్డి(50) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో అతని వెంట వస్తున్న రమణ తీవ్రంగా గాయపడగా 108లో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు..

## బస్సు బోల్తా-15 మంది గాయాలు

**ఎన్టీఆర్**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం మునగచర్ల జాతీయ రహదారిపై బస్సు బోల్తా పడిన ఘటనలో పదిహేను మందికి గాయాలు అయ్యాయి. హైదరాబాదు నుండి విజయవాడ వెళ్తున్న బస్సులో మొత్తం ప్రయాణికులు 40 మంది వున్నారు. క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు

## ఆసుపత్రి సిబ్బందిపై దాడికి యత్నం

**అన్నమయ్య**



మదనపల్లి జిల్లా ఆసుపత్రి అత్యవసర విభాగం డాక్టర్, నర్సు సిబ్బందితో పాటు ఔట్ పోస్టు ఏఎస్ఐపై ఒక రోగి బంధవులు దాడికి ప్రయత్నించారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటన శుక్రవారం ఉదయం వెలుగులోకి వచ్చింది.
అస్పత్రి అత్యవసర విభాగం వైద్యుల కథనం మేరకు గాంధీపురం నుంచి ఓ మహిళకు గాయమైందని అర్ధ రాత్రి ఆస్పత్రికి తీసుకు వచ్చారు. రోగి అడ్రెస్ వివరాలు అడగడంతో బూతులు మాట్లాడరని వైద్యులు, సిబ్బంది ఆరోపించారు. అసభ్య పదజాలంతో దూషించి పోలీసుల సమక్షంలోనే దాడికి తెగబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఓ జాతీయ పార్టీ వాళ్ళమని వార్నింగ్ కూడా ఇచ్చారు. పోలీసులు స్పందించి దాడికి యత్నించి అసభ్య పదజాలంతో మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు.

## డిజిల్ లేక.. అంబులెన్స్ రాక..

## రోడ్డు పైనే గిరిజన మహిళ ప్రసవం

**నిర్మల్**
నిర్మల్ జిల్లా ఒక గిరిజన మహిళ రోడ్డు పైనే ప్రసవించింది. డీజిల్ లేక అంబులెన్స్ రాకపోవడంతో రోడ్డుపై మగబిడ్డకు జన్మనిచ్చింది. వాగులు వంకలు చేతులపై దాటించినా, ఆమెకు వైద్యం అందలేదు. నాలుగు గంటలు రోడ్డుపైనే నరకయాతన అనుభవించింది. నిర్మల్ జిల్లా పెంబి మండలం మారుమూల తులసిపేట్ గ్రామనికి చెందిన గిరిజన గర్భిణీ గంగమణికి పురిటి నొప్పులు రావడంతో అంబులెన్స్ కు ఫోన్ చేసారు. ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక పోవడంతో స్థానిక ప్రజల సహకారంతో దొత్తి వాగును దాటించారు. అయినప్పటికి డీజిల్ లేదని ఐటిడిఎ అంబుల్స్ రాక పోవడంతో మహిళ రోడ్డుపై మగ శిశువుకు జన్మనిచ్చింది.

## వరంగల్ లో భూకంపం

**వరంగల్**
శుక్రవారం తెల్లవారుజామున 4:43 గంటలకు వరంగల్లో స్వల్ప భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.6గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ వెల్లడించింది. భూ అంతర్భాగంలో 30 కిలోమీట్లర్ల లోతుల్లో కదలికలు సంభవించాయని తెలిపింది.

## మంత్రి సబిత కార్యాలయం ముట్టడి

### బీజేపీ నేతల అరెస్టు

**రంగారెడ్డి**



విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి క్యాంపు కార్యాలయం ముట్టడికి వచ్చిన బిజెపి నాయకులు, పోలీసుల తోపులాట జరిగి ఉద్రిక్తత దారితీసింది.బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆదేశం మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల వెంటనే డిమాండ్ చేస్తూ శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం జిల్లాల గుడా లోని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కాంపు కార్యాలయం ముట్టడికి బిజెపి నాయకులు వచ్చారు. క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి చేసిన బిజెపి నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ నేపధ్యంలో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. తోపులాటలో మీర్పేట్ సీఐ కిరణ్ కుమార్ కింద పడిపోయారు.

# ప్రశ్నార్థకంగా 85 వేల ఎకరాల సాగు

**కడప ఆగస్టు 25:**

రాయలసీమ ప్రాంతంలో భూములు నెర్రెలిచ్చి ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాయి. నీరింకిన ప్రాజెక్టులను చూసి రైతు కళ్లు కన్నీటి ధారలవుతున్నాయి. దుక్కులు లేక జోడెడ్ల దిగులుగా ప్రాజెక్టుల వైపు ముఖం పెడుతున్నాయి. మబ్బులు కమ్మిన ఆకాశం ఊరించి ఉసూరుమనిపిస్తుంటే.. అన్నదాతలకు నిట్టూర్పులే మిగులు తున్నాయి. ప్రతి ఏటా జూలై మాసానికే నీటి పరవళ్లు కాలువల్లో జలజలమంటే.. ఈ ఏడాది ఎండిన ఏరులు బోరు మంటున్నాయి. ఇంకెప్పుడు నీరిస్తారయ్య అంటూ పాలకులను ప్రశ్నిస్తున్నాయి.కడప జిల్లాలో ప్రధాన సాగునీటి వనరు అయిన కడప- కర్నూలు కెనాల్ ఆయకట్టు రైతుల ఆశలు అడుగంటుతున్నాయి. ఆగస్టులోనూ కాలువకు నీరు చేరే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో జూలై గానీ ఆగస్టు మొదటి వారంలో గానీ కేసీ నీరు విడుదలయ్యేవి. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. దుక్కులు దున్నుకున్న రైతులు వర్షాల కోసం కళ్లలో వత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురిస్తేనే శ్రీశైలం జలాశయంలో పుష్కలంగా నీరు చేరి కేసీ కెనాల్కు విడుదల చేస్తారు. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో శ్రీశైలానికి నీరు చేరుతుందా ? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవకపోవడంతో శ్రీశైలం రిజర్వాయర్లో పూర్తి స్థాయి నీటి మట్టం చేరుకోలేకపోతోంది. మరో వైపు తెలంగాణ రాష్ట్రం విద్యుత్ ఉత్పాదన పేరుతో శ్రీశైలం రిజర్వాయర్ నీటిని వినియోగిస్తోంది. ప్రస్తుతం బావులు, చెరువుల కింద అరకొర వరి పంట సాగు చేశారు. దీనికి తోడు దుక్కులు దున్నకొని సాగు కోసం ఎదురు చూస్తున్నారు. చాలామంది రైతులు బోరు బావుల కింద నార్లు పోసుకున్నారు. నాట్లు ఆలస్యమైతే ఆ నారు కూడా ముదిరిపోయే అవకాశం ఉంది.కేసీ కెనాల్ పరిధిలోని కడప జిల్లాలో 92 వేల ఆయకట్టు ఉంది. దీని కింద దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ప్రొద్దుటూరు రాజుపాళెం, ఖాజీపేట, చెన్నూరు, వల్లూరు, కడప, చింతకొమ్మదిన్నె మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ప్రొద్దుటూరు, కడప, మైదుకూరు పట్టణాలు విస్తరించడంతో కేసీ కెనాల్ ఆయకట్టు కూడా ఇప్పుడు కమర్షియల్ ఏరియాగా మారింది. దీంతో కొన్ని భూములు కాలనీలు, నివాస యోగ్యాలుగా మారాయి. ఈ భూములు పోను నికరంగా ఇప్పుడు 85 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో వరి, ఉల్లి, పత్తి, జొన్న పంటలు సాగు చేస్తారు కేసీ కెనాల్కు నీటి విడుదలపై త్వరలో ప్రకటన చేస్తామని ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి తెలిపారు...

# రేపల్లె పై సుమన్ మనసు...

**గుంటూరు, ఆగస్టు 25 :**

సినీ హీరో, సుమన్ కు రాజకీయాలపై ఆసక్తి ఏర్పడింది. అయితే ఆయన అధికార పార్టీ నుంచే రంగంలోకి దిగాలని భావిస్తున్నారు. కాబట్టి, గుంటూరు జిల్లాలోని రేపల్లె నుండి ఆయన అరగ్రేటం చేయాలని ఆశిస్తున్నారని పార్టీలో టాక్ నడుస్తోంది. దీంతో ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులకు కూడా టచ్ లోకి వెళ్లారంట.. అంతే కాదు వ్యక్తి గతంగా వారి ఇళ్ళకు వెళ్ళి, మరి తన అభిప్రాయాలను షేర్ చేసుకున్నారంట. ఇక అదే సమయంలో గుంటూరు జిల్లాలోని కీలక నాయకులతో కూడా హీరో సుమన్ టచ్ లోకి వెళ్లారని అంటున్నారు. అయితే ఆయన రేపల్లె నియోజకవర్గం పేరు చెప్పటంతో అంతా సైలెంట్ అయిపోతున్నారని అంటున్నారు .రేపల్లె నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీటు విషయం పై సుమన్ పార్టీలోని సీనియర్ నేతలను కలిసిన సమయంలో అంతా ఆశ్చర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు. రాజకీయాల్లోకి రావటం అందులోనూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి రావటం శుభపరిణామం అయినప్పటికి ఆదే నియోజకవర్గం కోసం ఆసక్తి చూపించటం అంటే కష్టమని నాయకులు అంటున్నారంట. రాజకీయాల్లోకి రండి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి రండి కానీ, నియోజకవర్గాలు, పదవులు కోసం ముందే కర్చీఫ్ వేసుకోవటం వంటి పరిస్థితులు ఉంటే కష్టమని కొందరు నేతలు ముఖం ముందే చెప్పేస్తున్నారట, మరి కొందరు కీలక నేతలు అయితే ముందు పార్టీలోకి రావాలి కదా మీరు. అంటున్నారని టాక్...రేపల్లె నియోజకవర్గంలో ఇప్పటికే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇంచార్జ్ గా మోపిదేవి వెంకట రమణ ఉన్నారు. ఆయనే గత ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసి తెలుగు దేశం అభ్యర్థి అనగాని సత్య ప్రసాద్ చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే ఆ తరువాత ఆయనకు జగన్ ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు. ఎమ్మెల్సీ రద్దు విషయంలో తెర మీదకు రావటంతో అంతటితో ఆగకుండా జగన్ ఏకంగా రాజ్య సభ సీట్ ను కూడా మోపిదేవికి కట్టబెట్టారు. దీంతో జగన్ కోటరిలో మోపిదేవికి ఎంతటి ప్రాధాన్యం ఉంటుందనేది ఎవ్వరికి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేకుండా పోయింది. అయితే ఇప్పుడు అదే నియోజకవర్గం నుండి సినీ నటుడు సుమన్ రాజకీయ ఎంట్రీ కోరుకోవటంపై కూడా సందిగ్ధత ఏర్పడింది. మోపిదేవి లాంటి వ్యక్తిని కాదని ఎట్టి పరిస్థితుల్లోనూ మరొకరికి నియోజకవర్గంలో ఛాన్స్ ఇచ్చే అవకాశం లేదని కొందరు నాయకులు, సుమన్ కు ముఖం మీదనే చెప్పేసినప్పటికి ఆయనకు రాజ్యసభ స్థానం కల్పించినందున తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించమని అడగటంలో తప్పేమి లేదని సుమన్ అంటున్నారట.దీని కోసం ఎన్నో సార్లు హీరో సుమన్ ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ కోసం ప్రయత్నించారని చెబుతున్నారు. ఆయన మనస్సు రేపల్లె పై ఉందన్న సమాచారం ముఖ్యమంత్రి జగన్ చెవిలో పడటంతో ఆయన కూడా కలిసేందుకు సుముఖత చూపించలేదని చెబుతున్నారు. రేపల్లె సీట్ ను ఆశిస్తున్న విషయం తెలిసి కూడా అటు సుమన్ కు అపాయింట్ మెంట్ ఇవ్వటం అంటే, మోపిదేవిని కూడా ఇబ్బందికి గురి చేసినట్లు అవుతుందనే అభిప్రాయంలో జగన్ ఉన్నారని అంటున్నారు. దీంతో సుమన్ కు కనీసం ముఖ్యమంత్రిని కలిసేందుకు కూడా ఛాన్స్ దక్కలేదని పార్టీలో ప్రచారం ఉంది.

# 27న అమిత్ షా టూర్

**హైదరాబాద్, ఆగస్టు 25:**

ఆగస్టు 27వ తేదీన ఖమ్మంలో జరిగే బహిరంగ సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొనబోతున్నారు. ముఖ్య అతిథిగా హాజరు కాబోతున్న ఆయన రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నందున బీజేపీ తన ప్రయత్నాలను వేగవంతం చేసింది.అయితే అమిత్ షా ర్యాలీకి లక్షలాది మంది ప్రజలు హాజరవుతారని బీజేపీ అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది చివర్లోనే రాష్ట్రంలో ఎన్నికలు జరగనుండగా.. బీజేపీ పార్టీ ప్రచారానికి ఊపునిస్తుంది. అమిత్ షా జూన్లో ఇక్కడ ర్యాలీ నిర్వహించా ప్రసంగించాల్సి ఉండగా.. తుఫాను బిపార్జోయ్ కారణంగా వాయిదా పడింది. అయితే పరిస్థితులు చక్కబడిన తర్వాత మరోసారి తెలంగాణ పర్యటనకు అమిత్ షా వస్తారని.. ఖమ్మంలోనే బహిరంగసభ ఏర్పాటు చేస్తామని బండి సంజయ్ చెప్పారు. తెలంగాణ బీజేపీకి ఇటీవలి కాలంలో ఏదీ కలసి రావడం లేదన్న నిరాశ బీజేపీ క్యాడర్ లో వ్యక్తమవుతోంది. కానీ ఇదే సమయంలో అమిత్ షా పర్యటన ఫిక్స్ కావడంతో బీజేపీ శ్రేణులు తెగ సంబుర పడిపోతున్నారు. అమిత్ షా రాష్ట్ర పర్యటన సందర్భంగా పార్టీ ఎన్నికల సన్నాహాలను అంచనా వేయడానికి పార్టీ సీనియర్ నేతలతో కూడా సమావేశమవుతారు. క్షేత్రస్థాయి రిపోర్టులను పరిశీలించి, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పార్టీ ప్రణాళికలు, కార్యక్రమాలపై చర్చిస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి.ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని బీజేపీ నేతలు వివరిస్తున్నారు. తెలంగాణ ప్రజలు ఇప్పుడు బీజేపీ వైపు చూస్తున్నారని, వారి ఆకాంక్షలను గ్రహించి, అవినీతి బారి నుండి తెలంగాణను విముక్తి చేయడానికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కోసం చూస్తున్నారని చెప్పారు.తెలంగాణ ప్రజలకు బీజేపీ అండగా నిలుస్తుందని, వారి ఆకాంక్షలు, కలలు సాకారం అయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. అధికార భారత రాష్ట్ర సమితి అసెంబ్లీ ఎన్నికలకు చాలా మంది అభ్యర్థులను ప్రకటించింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది.

# ప్రభుత్వాసుపత్రిలో మద్యం మత్తులో ఉద్యోగి వీరంగం

**ముమ్మిడివరం**

ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో మేల్ నర్స్(ఎంఎన్ఎ)గా పనిచేస్తున్న గంధం సాయిప్రసాద్ మద్యం సేవించి విధులకు హాజరవ్వడమే కాకుండా రోగులపై దురుసుగా ప్రవర్తించడంతో రోగులు తీవ్ర నిరసన వ్యక్తంచేసారు. సాయిప్రసాద్ రోజూ విధులకు మద్యం సేవించి హాజరవుతున్నాడని, విధులను నిర్లక్ష్యంగా నిర్వహిస్తూ రోగులకు సేవలు అందించడంలో అలసత్వం వహిస్తున్నాడని, ఈ విషయంపై ఉన్నతాధికారులకుపిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆసుపత్రికి వెళ్లే రోగులు ఆరోపిస్తున్నారు. సాయిప్రసాద్ పూర్తిగా మద్యం సేవించి వైద్య సేవలందిస్తూ వైద్యసేవల కొరకు వచ్చే రోగులపై నియంత ధోరణితో వ్యవహరిస్తున్నాడని విషయాన్ని వైద్యసేవలకోసం వచ్చిన వారు ఆసుపత్రి ఉన్నతాధికారులకు, మీడియాకు పిర్యాదు చేసారు. ఈ విషయంపై ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మల్లేశ్వరిని వివరణ కోరగా అతను మద్యం సేవిస్తాడని తెలుసుగానీ విధులకు హాజరయ్యేటప్పుడు మద్యం సేవించి రావడం ఇంతవరకూ తన దృష్టికి రాలేదని వివరణ ఇచ్చారు. సాయిప్రసాద్ మద్య సేవించి విధులకు హాజరుకావడంపై ఆసుపత్రికి వచ్చే రోగులు వారి బంధువులు తీవ్ర అభ్యంతరం తెలియజేసారు. మద్యం సేవించి అత్యవసర విధులు నిర్వర్తించాల్సి వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఇతనిపై కేసులున్నాయని వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అతనిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## సోషల్ మీడియాతో తప్పుడు ప్రచారం

### మంత్రి తలసాని

**హైదరాబాద్**
ముషీరాబాద్ స్టీల్ బ్రిడ్జి ఓపెనింగ్ సందర్భంగా జరిగిన సంఘటనపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. మంత్రి మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ వచ్చిన సందర్భంగా ఎక్కువ రద్దీ ఏర్పడింది. ఓ వ్యక్తి నా కాలు తొక్కుతూ ముందుకెళ్లాడు. నా కాలుకు గాయమై రక్తమొచ్చింది. ఆ సందర్భంగా నే ఆ వ్యక్తిని నెట్టి వేశాను. సోషల్ మీడియాలో దీన్ని పదే పదే ప్రచారం చేస్తున్నారు. అతను బైంసా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ కుమార్ బాబు అని తెలిసింది. ఆయన గిరిజన బిడ్డా వెంటనే ఆయనకు ఫోన్ చేసి సారి చెప్పాను. దీనిపై కావాలనే నాపై సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. నేను బడుగు బలహీన దళిత, మైనార్టీ గిరిజన వర్గాల గొంతుకను. తెలంగాణ లో జరిగేవ సేవాలాల్, కొమురం భీం జయంతి కార్యక్రమాలు ముందుండి చేస్తాను. ఆరోజు జరిగిన ఘటనపై వాళ్ళ మనోభావాలు దెబ్బతింటే క్షమాపణ చెప్పుతున్నానని అన్నారు.

## సామర్లకోట నవదుర్గాలయంలో

## ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు

**కాకినాడ**
శ్రావణ వరలక్ష్మి వ్రతం పర్వదినం సందర్భంగా సామర్లకోట శ్రీ నవదుర్గా సమేత శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వ్రతాలు నిర్వహించారు. గత 54 సంవత్సరాల నుండి నిర్విరామంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్నామని, నవకాయ పిండి వంటలతో, షడ్రసోపేతమైన పదార్థాలతో ప్రసాదాన్ని అమ్మవారికి నివేదించి, వ్రతాలలో పాల్గొన్న ముత్తైదువులకు వాయినం ఇవ్వడం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు కనక విజయలక్ష్మి అమ్మవారు తెలిపారు. ఈ పూజలలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో వ్రతాలలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

## కాంగ్రెస్ లో చేరికలు

**హైదరాబాద్**
టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహబూబ్ నగర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది ఎన్.పీ. వెంకటేశం, మహబూబ్ నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. జూబ్లీహిల్స్ నివాసంలో తన నివాసంలో రేవంత్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## కృష్ణా ఎక్స్ ప్రెస్ లో పొగలు

**వెంకటగిరి**
తిరుపతి నుండి అదిలాబాద్ వెళ్ళే కృష్ణా ఎక్స్ ప్రెస్ కు పెను ప్రమాదం తప్పింది. తిరుపతి నుండి అదిలాబాద్ బయలు దేరిన కృష్ణా ఎక్స్ప్రెస్వెంకటగిరి రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే ఏసీ కోచ్ లో పొగలు రావడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురైయారు. వెంటనే చైన్ లాగి రైలును నిలిపివేశారు, వెంటనే అప్రమత్తమైన రైల్వే సిబ్బంది పొగలను ఆపివేయడంతో కృష్ణ ఎక్స్ప్రెస్ భారీ ప్రమాదం తప్పినట్లు అయింది,దీంతో 20 నిముషాలు పాటు ఆగిన కృష్ణా ఎక్స్ ప్రెస్ ఆలస్యంగా బయలుదేరింది.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

**భువనగిరి**
దిల్ సుక్ నగర్ డిపోకు చెందిన బస్సు దిల్ శుక్ నగర్ నుండి చౌటుప్పల్ వస్తుండగా కైతాపురం స్టేజి దగ్గర ప్రమాదానికి గురయింది. ముందు వెళుతున్న లారీ డ్రైవర్ సడెన్ గా యూ టర్న్ తీసుకోవడంతో బస్సు డ్రైవర్ సడన్ గా బ్రేక్ వేసాడు. దాంతో బస్సు అదుపులోకి రాకపోవడంతో లారీ వెనుక భాగంలో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ కు రెండు కాళ్ళు విరగడం తో పాటు ఇద్దరు ప్రయాణికులకు,కండక్టర్ కు గాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో ఇరవై మంది ప్రయాణిస్తున్నారు. జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయింది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని స్థానికులు, ఆర్టీసీ బస్సు కండక్టర్ అంటున్నారు. లారీ డ్రైవర్ పరారీలో వున్నాడు.

## పొట్టంగి పీహెచ్సీ సిబ్బంది నిర్వాకం

**పార్వతీపురం**
పొట్టండి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నిర్వాకం బయటపడింది. మృతదేహం తరలింపునకు అంబులెన్స్ ఇవ్వకపోవడంతో బైక్ పై మృతదేహాన్ని 27 కిలోమీటర్లు తరలించాల్సి వచ్చింది. మృతదేహాన్ని సాలూరు మండలం గంజాయిభద్రకు కుటుంబ సభ్యులు తరలించారు.

## రితీ సాహాది ఆత్మహత్యే

**విశాఖపట్నం**
విశాఖలో సంచలనం కలిగించిన ఇంటర్ విద్యార్థిని రితీ సాహాది ఆత్మహత్యేనని పోలీస్ కమిషనర్ త్రివిక్రమవర్మ తెలిపారు.ఆకాష్ బైజూస్లో రితి సాహా నీట్ ఎగ్జామ్కు ప్రిపేర్ అవుతోంద న్నారు. సాధన హాస్టల్లో ఉంటోందన్నారు. గత నెల 14వ తేదీ రాత్రి రితీసాహా హాస్టల్ గది నుంచి టెర్రస్ పైకి వెళ్లి అక్కడ తన ఐపాడ్, చెప్పులతోపాటు కొన్ని దుస్తులను నాలుగు అడుగుల గోడపై పెట్టి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా సీపీ స్పష్టం చేశారు.

# విజయవాడలో సీటుపై లోకేష్ క్లారిటీ

**విజయవాడ, ఆగస్టు 25:**

యువగళం పాదయాత్రలోనే పార్టీ అంతర్గత వ్యవహారాలను నారా లోకేష్ చక్కబెడుతున్నారు. తను పాదయాత్ర చేస్తున్న నియోజకవర్గాల్లో అభ్యర్థులను కూడా ఫైనల్ చేస్తున్నారు. పార్టీ నేతల మధ్య విబేధాలుంటే పరిష్కరిస్తున్నారు. తాజాగా విజయవాడలో మాస్ లీడర్ అయిన వంగవీటి రాధాకృష్ణ పోటీ చేసే స్థానాన్ని ఖరారు చేయడంపై నారా లోకేష్ దృష్టి సారించారు. ఈ అంశంపై పాదయాత్ర విరామ సమయంలో లోకేశ్ కసరత్తు చేశారు. వంగవీటి రాధాతో ఈ అంశంపై దాదాపుగా అరంగట సేపు చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది. యువగళం పాదయాత్ర విజయవాడకు వచ్చినప్పటి నుండి రాధా కూడా పాదయాత్రలో పాల్గొంటున్నారు. వంగవటి రాధా లాంటి నేతను ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేయించాలని..కానీ ఏ స్థానం నుంచి అన్నది మాత్రం ఇంకా క్లారిటీ రాలేదు. వంగవీటి రాధా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోనే రాజకీయాలు చేస్తూంటారు. కానీ అక్కడ టీడీపీ తరపున బొండా ఉమ అభ్యర్థిగా ఉన్నారు. ఇతర రెండు నియోజకవర్గాల్లోనూ బలమైన అభ్యర్థులు ఉన్నారు. వంగవీటి రాధాను మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలన్న ఆలోచనలో టీడీపీ ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. కానీ వంగవీటి ఆలోచనలపై మాత్రం స్పష్టత లేదు. ఆయనకు విజయవాడ నగరం దాటి వెళ్లే ఆలోచన లేదని అనుచరులు చెబుతున్నారు. కానీ వంగవీటి రంగా వారసుడిగా ఆయన కృష్ణా జిల్లాలో ఎక్కడ పోటీ చేసిన విజయం సాధిస్తారని ఆయన అనుచరులు నమ్మకంతో ఉన్నారు.ఎన్నికలు దగ్గరపడుతూండటంతో ఈ అంశంపై పూర్తి స్థాయిలో టీడీపీ, వంగవీటి రాధా కసరత్తు జరుపుతున్నట్లుగా తెలుస్తోంది. వంగవీటి అభిప్రాయం ప్రకారమే.. సీటు కేటాయించాడనికి టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఈ విషయంలో.. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే పరిష్కరిస్తామని చెబుతున్నట్లుగా తెలుస్తోంది. మరో వైపు వంగవీటి రాధాకృష్ణ పెళ్లి వచ్చే నెలలో జరగనుంది. చాలో లో ప్రొఫైల్‌లో అత్యంత సన్నిహితుల మధ్య ఈ వివాహ కార్యక్రమం జరగనుంది. ఈ వివాహానికి లోకేష్ ను వంగవీటి రాధాకృష్ణ ఆహ్వానించారని చెబుతున్నారు.

వంగవీటి రాధా కృష్ణా 2004 విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో మల్లాది విష్ణు చేతిలో అతి తక్కువ తేడాతో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత వైసీపీలో చేరారు రాధా. 2014 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి రాధా పోటీ చేశారు. కానీ ఓడిపోయారు. ఆ తర్వాత జరిగిన 2019 ఎన్నికల సమయంలో వంగవీటి రాధా టీడీపీ కండువా కప్పుకున్నారు. ఆ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఈ సారి పోటీ చేయాలని పట్టుదలతో ఉన్నారు

# సీనియర్ నేతలకు చెక్ పెట్టినట్టేనా

**హైదరాబాద్, ఆగస్టు 25:**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు టాప్ గేర్ లో ఉన్నారు కేసీఆర్. కానీ ఒకప్పుడు కేసీఆర్ ఎక్కువ పవర్ ఫుల్ గా ఉన్న నేతలు.. ఆయన సమకాలీకుల రాజకీయ జీవితం రిస్క్ లో పడిపోయింది. అసలు కంటిన్యూషన్ ఉంటుందా లేదా అని వారి అనుచరులు మదనపడే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతానికి ఈ జాబితా చాలా ఎక్కువగా ఉంది. ఇంకా విశ్లేషం ఏమిటంటే వీరిలో ఎక్కువ మంది కేసీఆర్ మీదనే ఆధారపడి ఉన్నారు. ఆయన కరుణిస్తేనే కంటిన్యూషన్ లేదంటే ప్యాకప్ అన్నట్లుగా మారిపోయింది. ఖమ్మం జిల్లాలో ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి టిక్కెట్ రాని కీలక బీఆర్ఎస్ నేత తుమ్మల నాగేశ్వరరావు. ఆయన అభిమానులు కింకర్తవ్యం అని చర్చలు జరుపుతున్నారు. కాంగ్రెస్ లో చేరాలని వారు తుమ్మలపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే తుమ్మల నాగేశ్వరరావు .. కేసీఆర్ సమకాలీకులు. టీడీపీలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ .. ఆ తర్వాత చంద్రబాబు నాయకత్వాల్లో తుమ్మల మంచి పవర్ ఫుల్ నేతగా ఉండేవారు ఉమ్మడి రాష్ట్రం మొత్తం ఆయన మాటకు పలుకుబడి ఉండేది. కానీ రాష్ట్ర విభజన తర్వాత ఆయనే కేసీఆర్ పంచనకు చేరారు. ఇప్పుడు కేసీఆర్ కూడా టిక్కెట్ కేటాయించకపోవడంతో తదుపరి ఎం చేయాలా అని ఆలోచిస్తున్నారు.ఇక టీడీపీ నుంచే కీలకంగా వ్యవహరించిన మోత్కుపల్లి నర్సింహులదీ అదే పరిస్థితి రెబల్ లీడర్ గా పేరున్న ఆయన ఆలేరు నుంచి చాలా సార్లు గెలిచారు. ఓ సారి ఇండిపెండెంట్ గా గెలిచారు. కేసీఆర్ పై మొదట్లో తీవ్ర వ్యతిరేకత చూపారు. టీడీపీలో చాలా కాలం ఉన్నా.. ఇక బయటకు రాక తప్పదనుకున్నప్పుడు .. టీడీపీపై, చంద్రబాబుపై చాలా విమర్శలు చేశారు. ఆ తర్వాత బీజేపీలో చేరారు. కానీ ఇమడలేకపోయారు. హుజూరాబాద్ ఉపఎన్నికల సమయంలో కేసీఆర్ ఆహ్వానిస్తే బీఆర్ఎస్ లో చేరారు.కానీ ఆ తర్వాత ఆయనను పట్టించుకున్న వారు లేరు. కేసీఆర్ ను ఎంత పొగిడినా ప్రయోజనం లేకపోయింది. ఇప్పుడాయ రాజకీయ భవిష్యత్ కు గ్యారంటీ లేదు. కేసీఆర్ కరుణిస్తేనే చాన్స్ ఉంటుంది. ఇక కేసీఆర్ సమకాలీకుల్లో మరొకరు మండవ వెంకటేశ్వరరావు.. డిచ్ పల్లి సెగ్మెంట్ నుంచి టీడీపీ తరపున వరుసగా గెలిచిన ఆయన.. రాష్ట్ర విభజన తర్వాత రాజకీయాల్లో సైలెంట్ అయిపోయారు. అనూహ్యంగా పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ లో చేరారు. కానీ కేసీఆర్ ఆయనకు ఓ పదవి ఇద్దామని కానీ.. లేదా పార్టీ పని చెబుదామని కానీ ఎప్పుడూ అనుకోలేదు. దాంతో ఆయన రాజకీయ జీవితం కూడా డైలమాలోనే ఉంది. కేసీఆర్ తల్చుకుంటే ఆయనకు ఓ పదవి వస్తుంది. ఇక కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా రెండు సార్లు వ్యవహరించి.. ఉమ్మడి రాష్ట్రంలో పవర్ ఫుల్ అనిపించుకున్న డీఎస్ ఇప్పుడు ఫేడవుట్ అయిపోయారు. అనారోగ్యంతో పాటు ఏ పార్టీలోనూ నిస్సహాయత స్థితిలో ఉన్నారు. ఇక తాటికొండ రాజయ్యకూ మంచి రోజులు అయిపోయినట్లేనని భావిస్తున్నాయి. ఈ ఎన్నికలు చాలా మంది సీనియర్లకు విశ్రాంతి కల్పిస్తాయని తెలంగాణ రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది.

# 28 మంది ఎమ్మెల్యేల మెడల పై కత్తి

## అనర్హత భయంతో నేతలు

**హైదరాబాద్, ఆగస్టు 25:**

మరో మూడు నెలల్లో తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సిద్ధమవుతున్న వేళ అధికార పార్టీ నేతలని ఎలక్షన్ పిటిషన్లు కలవరపెడుతున్నాయి. గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి పైన తెలంగాణ హైకోర్టు ఇచ్చిన అనర్హత వేటు తర్వాత పిటిషన్లు ఎదుర్కొంటున్న నేతల్లో టెన్షన్ నెలకొంది. దాదాపు 28 ఎలక్షన్ పిటిషన్లు తెలంగాణ హైకోర్టులో పెండింగ్ ఉన్నాయి. ఆగస్టు ఎండింగ్ లోపు ఎట్టి పరిస్థితిలో ఎలక్షన్ పిటిషన్‌లపై జడ్జిమెంట్ ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో లీడర్లు అంతా టెన్షన్ గురవుతున్నారు. గద్వాల్ ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి పై పడ్డ అనర్హత వేటు తర్వాత చాలామంది లీడర్లు తమ ఎమ్మెల్యే పదవికి ఏమవుతుంది అన్న టెన్షన్‌లో ఉన్నారు. 2018 లో జరిగిన ఎన్నికల్లో జరిగిన వివిధ కారణాలు, ఎన్నికల్లో జరిగిన గొడవలు, ఓట్ల లెక్కింపులో జరిగిన వ్యత్యాసాలపై దాదాపు 28 మందికి పైగా ప్రజాప్రతినిధులపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల అయిన తర్వాత చాలా చోట్ల జరిగిన గొడవలు, ఓట్ల లెక్కింపు కావచ్చు, ఓట్ల లెక్కింపు సంబంధించి అవకతవకల పైన విచారణ జరిపించాలని చాలామంది కోర్టును ఆశ్రయించారు. కొంతమంది లీడర్లు ఎన్నికల సమయంలో సరైన ఆస్తులు, సరైన కేసుల వివరాలను సమర్పించని కారణంగా వాళ్ళ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని కూడా పిటిషన్ దాఖలు చేశారు. గతంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తప్పుడు సమాచారం ఇచ్చారని అఫిడవిట్ ఆధారం తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చి జలగం వెంకట్రావుని కొత్తగూడెం ఎమ్మెల్యేగా ప్రకటించింది. ఆ తర్వాత సుప్రీం కోర్ట్ స్టే నివ్వడంతో మళ్లీ వనమా వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే గా కొనసాగుతున్నారు. ఇప్పుడు తాజాగా గద్వాల్ ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి పై అనర్హత వేటు వేసిన నేపథ్యంలో మిగిలిన ఎమ్మెల్యేలు కూడా తీవ్ర ఆందోళనలో ఉన్నారు. తెలంగాణ హైకోర్టులో ఎన్నికలకు సంబంధించిన పిటిషన్లు ఎదుర్కొం టున్న, పెండింగ్లో ఉన్న నియోజకవర్గాల వారిగా గమనిస్తే మంచిర్యాల, హుస్నాబాద్, గద్వాల్, మహబూబ్‌నగర్, దేవరకొండ, అసిఫాబాద్, పటాన్‌చెరు, ఖైరతాబాద్, వేములవాడ, సికింద్రాబాద్, కొడంగల్, ఇబ్రహీంపట్నం, మహబూబ్‌నగర్, వరంగల్ ఈస్ట్, ఆలేరు, జూబ్లీహిల్స్, మల్కాజ్‌గిరి, కరీంనగర్, ధర్మపురి, కోదాడ, నాగర్ కర్నూల్, గోషామహల్, వికారాబాద్, గజ్వేల్, పరిగి, జనగాం, కరీంనగర్, నాంపల్లి, కొత్తగూడెం సహా దాదాపు 30 మంది ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్లు తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.ఆగష్టు నెల చివరిలోపు ఎలక్షన్ పిటిషన్లను పూర్తిస్థాయిలో ఆర్డర్ ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు ఈ 30 నియోజక వర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అందరిలో టెన్షన్ నెలకొంది. మరొక 6 నెలల్లోనే ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఇప్పుడు ఎలాంటి ఆర్డర్ వస్తుందో అనే టెన్షన్ ప్రజా ప్రతినిధులు నెలకొంది.గద్వాల్ జేజమ్మగా పోయిన డీకే అరుణ తెలంగాణ హైకోర్టు అనూహ్య నిర్ణయంతో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేస్తారా లేదంటే సుప్రీంకోర్టుకు వెళ్లి కృష్ణమోహన్ రెడ్డి చేయి తెచ్చుకుంటారా అన్నదానికైనా కొన్ని రోజులు క్లారిటీ రానుంది.

# హైదరాబాద్ లో గన్ కల్చర్

**హైదరాబాద్, ఆగస్టు 25:**

హైదరాబాద్ లో గన్‌ల మోత కలకలం సృష్టిస్తోంది, ఒకప్పుడు హైదరాబాద్ శివారు ప్రాంతాలకే విస్తరించిన గన్ కల్చర్ తాజాగా నగరం మొత్తం వ్యాపించింది. తెలంగాణ లో గన్‌ల మోత కలకలం సృష్టిస్తోంది. బుధవారం మియాపూర్‌లోని మదీనాగూడలో ఉన్న సందర్శిని హోటల్ లో జరిగిన కాల్పుల ఘటన మరోసారి హైదరాబాదులో తుపాకుల కల్చర్ ఏరకంగా పెరిగిపోయిందో అనడానికి ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పుకోవచ్చు.. కలకత్తాకి చెందిన దేవేందర్ తొమ్మిదేళ్లుగా సందర్శిని హోటల్లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.అదే హోటల్లో పనిచేస్తున్న కేరళకి చెందిన రతీష్ అనే వ్యక్తితో మంచి సంబంధాలు ఉన్నాయి. ఆ హోటల్లో జనరల్ మేనేజర్ పోస్ట్ ఖాళీ ఉండడంతో ఆ పోస్టు కోసం ఇద్దరి మధ్య పోటీ వచ్చింది . దేవేందర్ పనితీరు మంచిగా ఉండటంతో ఇతనికి జనరల్ మేనేజర్ గా ప్రమోషన్ ఇచ్చారు హోటల్ వాళ్ళు. దీంతో దేవేందర్ పై రితేష్ కోపం పెంచుకున్నాడు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి రితేష్‌ను హోటల్ వాళ్లు ఉద్యోగం నుంచి తొలగించారు దీంతో దేవేందర్ పై కోపం పెంచుకున్న అతన్ని చంపాలనుకున్నాడు టైం చూసికాపు కాసి పక్కా ప్లానింగ్ ప్రకారం కాల్పులు జరిపాడు.ఇక హైదరాబాద్‌లో అయితే రియల్ మాఫియా విచ్చలవిడిగా తుపాకులను కొనుగోలు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం సరిహద్దుల్లో మట్టారెడ్డి గ్యాంగ్ జరిపిన కాల్పులు సైతం కంట్రీమేడ్ వెపన్‌తో చేసిన పనిగా పోలీసులు నిర్ధారించారు. హైదరాబాద్ నుంచి కారులో బీహార్‌కు పంపి రెండు వెపన్స్‌ను రూ.30 వేలకు తెప్పించినట్టుగా పోలీసుల విచారణలో తేలింది. తాజాగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హత్యకు కుట్ర కేసులో రెండు తుపాకులనూ యూపీ నుంచి బస్సుల్లో హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్టు గుర్తించారు. బేగంపేటలో సైతం అన్నదమ్ముల మధ్య పంచాయతీ కోసం బీహార్ నుంచి తుపాకీ కొని తీసుకొచ్చారు.గతంలో హైదరాబాద్‌కు స్పెషల్ ముఠా ద్వారా వెపన్స్ తీసుకొచ్చేవారు. వాటిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఈబీ అధికారులు తనిఖీలు చేసి పట్టుకునేవాళ్లు. అయితే హైదరాబాద్ లో పని చేస్తున్న యూపీ, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కూలీలు.. తమ ప్రాంతాల నుంచి గన్లను తీసుకొస్తున్నారు. కేవలం కాల్పుల ఘటన జరిగిన తర్వాత మాత్రమే పోలీసులు గన్స్ ఎక్కడి నుంచి వచ్చాయో బయటపెడుతున్నారు. హైదరాబాద్ రియల్టర్ల మధ్య కాల్పులు, గ్యాంగ్‌ల మధ్య వార్ నుంచి చోరీలకు, చైన్‌స్నాచింగ్‌లకు, హత్యల కుట్రలకు ఇంత ఈజీగా వెపన్స్ దొరుకుతుండడంతో నేరాలకు పాల్పడుతున్నారు. నగర శివారులో మరోసారి కాల్పుల మోత మారుమోగింది. పట్టపగలు నడిరోడ్డుపై జరిగిన ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇద్దరు రియల్టర్లపై కాల్పులు జరిపి హత్య చేసిన నిందితులను గుర్తించకపోయినా, వారు వినియోగించిన ఆయుధం మాత్రం అక్రమమే అన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.లైసెన్స్‌డ్ ఆయుధమున్న వారు నేరుగా కాల్పులు జరిపే అవకాశాలు తక్కువగా ఉండటంతో రియల్టర్లపై కాల్పులకు కంట్రీమేడ్ ఆయుధమే వాడి ఉంటారని భావిస్తున్నారు. దీంతో అక్రమ ఆయుధాల ఉనికి మరోసారి నగరంలో బహిర్గతమైంది. సంతలో సరుకులా లభిస్తున్న అక్రమ ఆయుధాలకు ఇతర రాష్ట్రాల గ్యాంగులు సరఫరా చేసిన ఘటనలను పోలీసులు గతంలో గుర్తించారు. రియల్ వ్యాపారంలో వీటి వినియోగం ఎక్కువగా బయటపడటం గమనార్హం. కొందరు అడ్డదారుల్లో ఆయుధాలను సమకూర్చుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. స్టేటస్ కోసం కొందరు, భయాందోళనలకు గురి చేసేందుకు మరికొందరు ఆక్రమంగా ఆయుధాలను సమకూర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. సిటీ కల్చర్‌లో తుపాకీ స్టేటస్ గా మారింది. ఒకప్పుడు ప్రముఖులకు, ప్రాణభయం ఉన్న వారికి మాత్రమే పలు రకాలుగా ఆరా తీసిన తర్వాత లైసెన్సు లభించేది. ఇప్పటికే మూడు కమిషనరేట్ల పరిధిలో సుమారు 7 వేల లెసెన్స్‌డ్ వెపన్స్ ఉన్నాయి. ఇంకా వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

# కోత విధించిన మున్సిపల్ డ్రైవర్ల వేతనాలు చెల్లించాలి

**నిజామాబాద్ సిటీ, ఆగస్ట్ 25**

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య డ్రైవర్ల వేతనాల్లో కోత విధించడాన్ని, రికవరీ చేసిన వేతనాలను చెల్లించాలని నగర మేయర్ ను మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు కోరారు. శుక్రవారం నిజామాబాద్ నగర లోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ ని మర్యాదపూర్వకంగా కలసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ? రాష్ట్ర ప్రభుత్వం మేడే కానుకగా పారిశుధ్య కార్మికులకు వెయ్యి రూపాయలు వేతనాన్ని పెంచింది, పెంచిన వేతనాన్ని రెండు నెలలుగా మున్సిపల్ డ్రైవర్లకు చెల్లించి, మళ్లీ ఆ వేతనాలను రికవరీ చేయడం నిజామాబాద్ మున్సిపల్ పాలకవర్గ చరిత్రలో ఎప్పుడూ జరగలేదని మున్సిపల్ అధికారులు కొత్త ఆనవాయితీకి తెరతీసారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలలో చెల్లిస్తున్నట్టుగానే పారిశుద్ధ్య డ్రైవర్లకు కూడా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నగర మేయర్ నీతు కిరణ్ చంద్రశేఖర్ స్పందిస్తూ? ప్రభుత్వ పరంగా కార్మికులకు అందాల్సిన వేతనాలను తప్పకుండా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు కే భూపతి, నాయకులు సర్వేశ్, చిరంజీవి, మహేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పై ఉమ్మడి అభ్యర్థిగా కోదండరామ్

**హైదరాబాద్, ఆగస్టు 25:**

తెలంగాణ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ రెండు స్థానాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో ఆయన ఓటమి భయంతో ఉన్నారని విపక్షాలు ఓ అంచనాకు వచ్చాయి. అటు గజ్వేల్‌లో కానీ ఇటు కామారెడ్డిలో కానీ ఓ ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలన్న ప్రతిపాదనను తెరపైకి తెస్తున్నారు. తెలంగాణ పొలిటికల్ జేఏసీ మాజీ చైర్మన్ కోదండరాం ఈ విషయాన్ని అన్ని పార్టీల ముందు ఉంచారు. కేసీఆర్‌పై ఉమ్మడి అభ్యర్థిని దింపితే బాగుంటుందని గద్దర్ ఆలోచన చేశారన్నారు. ఆ దిశగా విపక్ష పార్టీలు ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై రాజకీయ పార్టీలన్నీ ఓ స్పష్టతకు వచ్చే అవకాశాలు ఉన్నాయని జోరుగా చర్చ జరుగుతోంది. తెలంగాణ సీఎం కేసీఆర్ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోలేదు. అంటే.. తెలంగాణలోని ఏ ఒక్క పార్టీ కూడా ఆయనకు మద్దతుగా లేదు. అన్ని పార్టీలూ వ్యతిరేకమే. కేసీఆర్ ను ఓడించాలన్న లక్ష్యంతో అన్ని పార్టీలూ ఉన్నాయి. అంటే.. అందరూ కలిసి ఒకే అభ్యర్థిని నిలబెట్టాడనికి ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ ఇక్కడ విపక్షాల్లో కాంగ్రెస్, బీజేపీలు కూడా ఉన్నాయి. రెండూ కలిపి ఒకే అభ్యర్థిని నిలబెట్టడం అన్నది అసాధ్యం. అదే సమయంలో ఓ పార్టీ తరపున నిలబెట్టిన అభ్యర్థికి మరో పార్టీ మద్దతు ఇవ్వడం కూడా ఊహించలేము. ఇలాంటి సమస్యలు వస్తాయి కాబట్టి ఉమ్మడి అభ్యర్థి సాధ్యం కాదని ఎక్కువ మంది అనుకుంటారు. కానీ అసలు ఏ పార్టీ లేకుండా .. గుర్తు లేకుండా తెలంగాణ పట్ల నిబద్దత ఉన్న నేతను ఇండిపెండెంట్ గా నిలబట్టి అందరూ మద్దతు ఇస్తే తటస్తులు కూడా .. ఓట్లు వేస్తారన్న విశ్లేషణలు ఇప్పటికే వినిపిస్తున్నాయి తెలంగాణ రాష్ట్ర సాధన పూర్తిగా తెలంగాణ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమం ద్వారా జరిగింది. ఈ జేఏసీ వెనుక కేసీఆర్ కీలకశక్తి కానీ తెర ముందు ఉండి నడిపించింది మాత్రం ప్రొఫెసర్ కోదండరాం. కారణాలు ఏవైతేనేం... ఆయన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ కు దూరమయ్యారు. సొంత పార్టీ పెట్టుకున్నారు. కానీ అనుకున్నంతగా సక్సెస్ కాలేదు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారు ఎందరో కీలక పదవుల్లో ఉన్నారని.. కోదండరాంకు ఏం తక్కువన్న సానుభూతి ఉద్యమకారుల్లో , ప్రజల్లో ఉంది. అదే సమయంలో కేసీఆర్ ఎన్ని పదవులు ఆఫర్ ఇచ్చినప్పటికీ తిరస్కరించి పోరాట పంథా ఎంచుకున్నారన్న మంచి పేరు ఉంది. దీంతో ఆయనే కేసీఆర్‌కు సరైన ఉమ్మడి ప్రత్యర్థి అవుతారన్న అంచనాలు కూడా ఎక్కువగా వినిపిస్తున్నాయి.ఒక్కో పార్టీ వచ్చి అడిగితే కోదండరాం అంగీకరించకపోవచ్చు ..కానీ కాంగ్రెస్ , బీజేపీ సహా అన్ని పార్టీలు కలిసి వచ్చి .. పోటీ చేయమని అడిగితే మాత్రం ఆయన అంగీకరించవచ్చు. కానీ రెండు జాతీయ పార్టీలు ఒకే ఒరలో ఇమడవు. అది దాదాపుగా అసాధ్యం. పార్టీల ముద్ర లేదు కాబట్టి.. తాము కేసీఆర్ పై పోటీ పెట్టడం లేదని.. తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన కోదండరాం లాంటి వారు అసెంబ్లీకి రావాల్సి ఉంది కాబట్టి.. ఎవరూ పోటీ పెట్టడం లేదని చెప్పి.. ప్రచారాలు లేకుండా ఉంటే... సాధ్యమవుతుంది. అంటే.. కోదండరాం నిలబడతారు కానీ ఎవరూ బరిలో ఉండరు కేసీఆర్ తప్ప. ఆయనపై పార్టీ ముద్రలు ఉండవు. ఏ పార్టీలు కూడా జోక్యం చేసుకోవాల్సిన అవసరం రాదు. కానీ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఎవరు ఎవరివైపో అంచనా వేయడం కష్టంగా ఉంది. అందకే ఈ ప్రతిపాదన ఎంత మేర ముందుకు వెళుతుందన్నది అంచనా వేయడం కష్టమే.

# మాదిగ కులాన్ని కించపరించిన ముఖ్యమంత్రి కెసిఆర్

**పెద్దపల్లి**

రాష్ట్ర క్యాబినెట్ ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఎస్సీ వర్గీకరణకై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సిన పూర్తి బాధ్యత తెలంగాణా ముఖ్యమంత్రి కేసిఆర్ దేనని ఎమ్మార్పీ ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోంగ్ర శంకర్ స్పష్టం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయని, అందులో మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలు ఉన్నట్లు తెలిపిన ఆయన, అందులో ఒక్కటి కూడా మాదిగ వర్గానికి ఇవ్వకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ



మూడు నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం యూనిట్లు వందలో 75వరకు మాల సామాజిక వర్గానికి ఇవ్వడం జరిగిందని ఆగ్రహించారు. తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు భూమిలేని కుటుంబా లకు మూడెకరాల భూమి పంపిణీ చేస్తామని, ఇల్లులేని పేదలకు డబుల్ బెడ్ రూమ్స్ నిర్మిస్తా మని, దళితబంధు పేరుతో రూ.10లక్షల ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు పరచకుండా, మళ్లీ బీసీబందు, మైనార్టీ బందు, భూమి ఉన్న కుటుంబాలకు గృహలక్ష్మి పేరుతో రూ.3లక్షల ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్నద ని ఆరోపించారు. ఇలలంటి మాదిగ వ్యత్రేక బి ఆర్ ఎస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ఓటుతో తగినబుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట్ల జిల్లా అధ్యక్షులు కొట్టెపెల్లి దుర్గ ప్రసాద్, యాసర్ల తిమోతి, కొంగ్ర నాగరాజు, కొయ్యల మొండి, తదితరులు ఉన్నారు.

# విశాఖ ఎంపీ సీటుకు మహా డిమాండ్

**విశాఖపట్టణం, ఆగస్టు 25 :**

ఏపీలో ఇటు రాజకీయంగా.. అటు పాలనా పరంగా హీటెక్కిస్తున్న నగరం విశాఖ. అధికారికంగానైనా.. అనధికారకంగానైనా విశాఖ నుండి పాలన సాగించాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి మొండిగా ఉన్నారు. విశాఖ నగరాన్ని పరిపాలనా రాజధానిగా మార్చాలని చూస్తున్నా.. కోర్టులలో బ్రేకులు పడుతుండటంతో కనీసం తానైనా పరిపాలన అక్కడ నుండి సాగించేందుకు రెడీ అయిపోతున్నారు. ఇందుకోసం అక్రమార్గంలో ఇక్కడ భవనాల నిర్మాణం కూడా మొదలెట్టేశారు.వైసీపీ ప్రభుత్వం రాజధానిగా విశాఖ అనే ప్రకటన అనంతరం ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం, కబ్జాలు, రౌడీయిజం, గుండాయిజం కూడా విజృంఖలంగా విస్తరించింది. సాక్షాత్తు ఎంపీ కుటుంబాన్నే కిడ్నాప్ చేసి ఒక రోజంతా ముప్పతిప్పలు పెట్టి విడిచిపెట్టారంటే పరిస్థితి ఎంతగా దిగజారిపోయిందో ఇట్టే అవగతమౌతుంది. మరోవైపు గంజాయి వాడకంలో కూడా విశాఖ వేగంగా తొలి స్థానానికి చేరుకుంటోంది. విశాఖలో దిగజారుతున్న పరిస్థితులపై ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ఇదంతా ఒకెత్తు అయితే ఇప్పుడు రాజకీయంగా కూడా విశాఖ హాట్ సీట్ గా మారిపోయింది. రాజధాని తెస్తాం, ఇస్తామని అధికార పార్టీ విశాఖ కేంద్రంగా రాజకీయాలు చేస్తుంటే.. విశాఖలో పెరిగిన కబ్జాలు, రౌడీయిజం, ధ్వంసమవుతున్న ప్రకృతిని ప్రతిపక్షాలు హైలైట్ చేస్తున్నాయి. దసరా నుండి విశాఖ కేంద్రంగా సీఎం జగన్ పరిపాలన చేయాలని ఆరాటపడుతుంటే.. మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా విశాఖ పర్యటనలు, యాత్రలు చేపడుతూ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అవుతున్నారు. చంద్రబాబు తాజాగా విశాఖలో విజన్ 2047 పేరుతో డాక్యుమెంట్ విడుదల చేయడమే కాకుండా.. విశాఖ వీధుల్లో ర్యాలీ కూడా నిర్వహించారు. ఇండియా అభివృద్ధికి ఏం చేయాలో మేధావుల మాటగా చెప్పిన చంద్రబాబు పనిలో పనిగా రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం తెచ్చిన నష్టాన్ని అక్కడి ప్రజలకు వివరించారు. మరోవైపు పవన్ కళ్యాణ్ తన మూడవ విడత వారాహీ యాత్రలో భాగంగా విశాఖ సహా ఉత్తరాంధ్రను చుట్టేశారు. టీడీపీ, జనసేన రుషికొండపై అక్రమ తవ్వకాలు, కట్టడాల నిర్మాణంపై తీవ్రంగా వైసీపీని టార్గెట్ చేసి ఏకిపారేశారు.తన తల్లి విజయమ్మను ఓడించిన విశాఖలో ఎలాగైనా జెండా ఎగరేయాలని సీఎం జగన్ ఆశపడుతుంటే.. టీడీపీ తన సత్తా చాటుకొని విశాఖ రాజధాని సిద్దాంతం తప్పని నిరూపించాలని చూస్తున్నది. సామజికంగా కలిసి వచ్చే అవకాశం ఉండడంతో జనసేన ఎలాగైనా ఇక్కడ పాగా వేయాలని చూస్తుండగా.. ఏపీ మొత్తం మీద బీజేపీకి ఎంతో కొంత కలిసి వచ్చే స్థానం ఇదే కావడంతో బీజేపీ కూడా ఇక్కడ తిష్టవేసి వ్యవహారం నడిపించాలని చూస్తున్నది. ఇది కాకుండా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ లాంటి వారు చాప కింద నీరులా స్వతంత్ర అభ్యర్థిగా అయినా పోటీచేసి తమ ఉనికి చాటుకోవాలని చూస్తున్నారు. ప్రస్తుతం విశాఖ సిట్టింగ్ ఎంపీ వైసీపీ నేత ఎంవీవీ సత్యనారాయణ. వ్యాపార వ్యవహారాలలో ఈయన కుటుంబాన్ని దుండగులు కిడ్నాప్ చేసి ఒక రోజంతా కస్టడీలో ఉంచుకున్నారు. ఆ తర్వాత పెద్దగా రాజకీయాల జోలికి రాని ఎంపీ మకాం కూడా హైదరాబాద్ కు మార్చునున్నట్లు స్వయంగా ప్రకటించారు. అయితే, ఇప్పుడు మరోసారి రేసులో ఉంటారా ఉండరా అన్నది తేలాల్సి ఉంది. ఎంవీపీ అలా డైలమాలో ఉండడంతో విజయసాయి రెడ్డి తన అల్లుడిని నిలబెట్టాలన్న యోచనలో ఉన్నారు. వాస్తవానికి అల్లుడి కోసమే కొన్నేళ్లుగా విజయసాయి ఇక్కడ రాజకీయ పునాది వేశారని వైసీపీలో టాక్ మొదలైంది. ఇక ప్రధాన ప్రతిపక్షం టీడీపీ నుండి బాలకృష్ణ చిన్నల్లుడు, గీతం విద్యాసంస్థల అధిపతి భరత్ మరోసారి పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తుంది. గత ఎన్నికలలో స్వల్ప తేడాతో ఓడిన భరత్ ఈసారి ఎలాగైనా గెలవాలని పట్టుదలతో ఉన్నారని టీడీపీ క్యాడర్ గట్టిగా భావిస్తుంది.జనసేన కూడా ఈ సీటు మీద మక్కువ చూపిస్తుంది. ఆ పార్టీ నుంచి విశాఖ సీనియర్ లీడర్ 2014లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేసిన బొలిశెట్టి సత్యనారాయణ బరిలోకి దిగుతారని అంటున్నారు. 2019 ఎన్నికల్లో జనసేనకు రెండు లక్షల ఎనభై వేల ఓట్లు రాగా ఈసారి గట్టిగా ప్రయత్నిస్తే గెలిచే అవకాశం ఉంటుందని జనసేన నమ్ముతున్నది. మరోవైపు ఇప్పటికే జనసేనతో పొత్తులో ఉన్న బీజేపీ కూడా ఈ సీటు ఆశిస్తున్నట్లు తెలుస్తుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి విశాఖ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆమె విశాఖ ఎంపీగా 2009 ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి కేంద్రంలో మంత్రి కూడా అయ్యారు. జనసేన, బీజేపీ కలిసి టీడీపీతో పొత్తుకు వెళ్తే ఈ సీటు ఎవరు దక్కించుకుంటారన్నది మరింత ఆసక్తి కరం. మరోవైపు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ కూడా ఇక్కడ ఇండిపెండెంట్ గా పోటీ చేయాలని భావిస్తున్నారు. దీంతో వచ్చే సార్వత్రిక ఎన్నికలలో విశాఖ ఎంపీ సీటుపై సర్వత్రా తీవ్ర ఆసక్తి నెలకొంది.

# ఎమ్మెల్యే అంటే 100 కోట్లపైనేనా

**హైదరాబాద్, ఆగస్టు 25:**

మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ పార్టీ క్యాండిడేట్ల ఫస్ట్ లిస్టు ప్రకటించింది. మిగితా పార్టీలు సైతం త్వరలో ప్రకటించ నున్నాయి. అయితే.. ఇప్పటికే టికెట్ సాధించిన వారు, ఇతర పార్టీల్లో టికెట్ వస్తుందని ధీమాతో ఉన్న వారు ఇప్పుడు ఎన్నికల ఫండింగ్ వేటలో పడ్డారు. జనరల్ స్థానాల్లో రూ.100 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు అంచనాలు రూపొందిస్తుండగా.. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో సెగ్మెంట్‌కు రూ.30 కోట్ల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తుందని భావిస్తున్నారు. 'ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ కాంగ్రెస్ నేతకు ఏఐసీసీ నుంచి టిక్కెట్ కన్ఫమ్?అయిందనే సంకేతాలు అందడంతో.. ఇప్పుడు ఆయన ఆర్థిక వనరులు సమకూర్చుకునే పనిలో పడ్డారు. గతంతో పోల్చితే ఈ ఎన్నికల్లో మనీ ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనాకు వచ్చిన ఆయన.. సుమారు రూ.100 కోట్ల వరకు సిద్ధం చేసేందుకు రెడీ అవుతున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. టికెట్ వస్తే ఆయన జనరల్ సెగ్మెంట్ నుంచి బరిలో పోటీచేయనున్నారు. ఇప్పటికే అతనికి ఉన్న భూములను అమ్మకానికి పెట్టగా.. బ్యాంకుల నుంచి కూడా రుణాలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది."ఇప్పటికే కొందరు ఆస్తులు, భూములు అమ్మకాలకు పెట్టగా, మరికొందరు అనుచరుల పేరిట లోన్లు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇంకొందరు సేల్ డీడ్‌లతో ఇంటర్నల్ ఒప్పందాలు చేసుకుంటున్నారు.పార్టీ ఎన్నికల వ్యయాన్ని అమాంతం పెంచేసిందని ప్రతిపక్ష పార్టీలు విరుచుకుపడుతున్నాయి. రెండు టర్మ్‌లు అధికారంలో ఉండడంతో.. ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చుపెట్టేందుకు సిద్ధమవుతోందని కాంగ్రెస్, బీజేపీలు భావిస్తున్నాయి. ఇప్పటికే దుబ్బాక, హుజూరాబాద్, నాగార్జునసాగర్, మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ చేసిన ఖర్చే ఇందుకు నిదర్శనంగా భావిస్తున్నారు. తమ పార్టీల నుంచి సపోర్టు లేకపోవడంతో గత్యంతరం లేక ఆస్తులు, భూములు అమ్మకాలతోపాటు లోన్లు కూడా పెట్టాల్సిన వస్తోందని ఓ నేత చెప్పుకొచ్చారు. కాగా.. ఇప్పటికే చట్టసభల్లో ప్రజాప్రతినిధులుగా ఉన్న వాళ్లకు డబ్బు జమ కష్టం కాకపోయినా.. కొత్తగా పోటీ చేసే వారికి మాత్రం సవాల్‌గా తయారైంది.రెండు సార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టేందుకు కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా ఊహించని విధంగా ఇప్పటికే 115 మందికి టిక్కెట్లు ప్రకటించింది. ఇందులో సుమారు 30 నుంచి 35 మంది ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ఉన్నట్లు కొన్ని రోజులుగా వివిధ సర్వేలు చెబుతున్నా.. కేసీఆర్ వాటిని ఖాతరు చేయకుండా వారికే టికెట్లు కేటాయించారు. అయితే.. డబ్బు ప్రభావం చూపితే వ్యతిరేకత ఉన్న అభ్యర్థులను కూడా గెలిపించుకోవచ్చే ధీమాతో బీఆర్ఎస్ ఆలోచిస్తునలో ఉన్నట్లు పొలిటికల్ సర్కిల్‌లో టాక్ నడుస్తోంది. అయితే భారీగా డబ్బులు ఖర్చు పెట్టి గెలిస్తే పదింతలు సంపాదించుకోవచ్చనే యోచనలో నేతలు ఉన్నారు.

# ఆసక్తికరంగా ములుగు రాజకీయం

**వరంగల్, ఆగస్టు 25:**

ములుగు అసెంబ్లీ పోరు ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్ నుంచి సీతక్క బరిలో ఉండనున్న నేపథ్యంలో? బీఆర్ఎస్ అభ్యర్థిగా బడే నాగజ్యోతి ఖరారయ్యారు. నక్సలైట్ నేపథ్యం ఉన్న వీరిద్దరూ బ్యాలెట్ పోరులో తలపడనున్నారు.తెలంగాణలో ఎన్నికల వేడి మొదలైంది. వచ్చే ఎన్నికల కోసం ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉంటే... అధికార బీఆర్ఎస్ ఏకంగా 115 మంది అభ్యర్థులను ప్రకటించి సవాల్ విసిరింది. కేవలం నాలుగు స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. దాదాపు సిట్టింగ్ లకే సీట్లు కేటాయించిన గులాబీ బాస్ కేసీఆర్.... కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే కొత్త వారికి చోటు ఇచ్చారు. ఇందులో అనూహ్యంగా ములుగు సీటు నుంచి నుంచి ప్రస్తుతం జెడ్పీటీసీగా ఉన్న ఉన్న బడే నాగజ్యోతి పేరును ఖరారు చేశారు. బలమైన నాయకురాలిగా పేరున్న సీతక్కను ఢీకొట్టేందుకు అభ్యర్థి విషయంలో చాలా కసరత్తే జరిగిందన్న చర్చ నడుస్తోంది.ములుగు నియోజకవర్గం అభ్యర్థిగా బడే నాగజ్యోతి పేరు ప్రకటనతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. అసలు ఎవరీ ఈ నాగజ్యోతి అనే చర్చ గట్టిగా జరుగుతోంది. నిజానికి ములుగు అనగానే అందరికి గుర్తుకువచ్చే పేరు సీతక్క. ఇక్కడ్నుంచి ఆమె ప్రస్తుతం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2018 ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ గెలిచిన ఏకైక సీటు కూడా ఇదే. అయితే సీతక్క ఓ మాజీ నక్సలైట్ గా అందరికీ తెలిసిన విషయమే. నిత్యం ప్రజల్లో ఉండే నాయకురాలిగా సీతక్కకు పేరుంది. అయితే ఇక్కడ వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గులాబీ జెండాను ఎగరవేయాలన్న లక్ష్యంతో బీఆర్ఎస్ ఉంది. అయితే ఈ నేపథ్యంలో పక్కా వ్యూహాన్ని రచించింది. అందులో భాగంగానే బడే నాగజ్యోతిని తెరపైకి తీసుకువచ్చింది.బడే నాగజ్యోతి... ఈమె దివగంత నక్సలైట్ బడె నాగేశ్వర్ రావు కుమార్తె. 2018లోజరిపిన ఎన్‌కౌంటర్లో నాగేశ్వర్ రావు చనిపోయారు. నాగజ్యోతి మామ బడే చొక్కా రావు అలియస్ దామోదార్ ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో యాక్టివ్ గా పని చేస్తున్నారు. ప్రస్తుతం నాగజ్యోతి.... ములుగు జిల్లా జెడ్పీ ఛైర్ పర్సన్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ములుగు జిల్లాలోని ఎస్ఎస్ తడ్వాయి మండలం కలవపల్లి గ్రామానికి చెందిన నాగజ్యోతి.... ఎమ్మెస్సీ పూర్తి చేసింది. 2019లో మొదటిసారిగా సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత గులాబీ గూటికి చేరింది. తడ్వాయి మండలం నుంచి జెడ్పీటీసీగా విక్టరీ కొట్టింది. ఆ తర్వాత జడ్పీ వైస్ ఛైర్ పర్సన్ గా ఎన్నికైంది. జెడ్పీ ఛైర్మన్ గా కుసుమ జగదీశ్ మరణం తర్వాత ప్రస్తుతం జెడ్పీ ఛైర్ పర్సన్ గా విధులు నిర్వర్తిస్తుంది. ఈ నేపథ్యంలో ఆమెకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించింది బీఆర్ఎస్ అధినాయకత్వం.

ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సీతక్క...గతంలో మావోయిస్టుగా పని చేసింది. 1997లో ఆమె పోలీసులకు సరెండర్ అయ్యారు. ప్రజాజీవితంలోకి వచ్చిన ఆమె... ఉన్నత విద్యను పూర్తి చేసింది. ఓయూలో పీహెచ్డీ కూడా కంప్లీట్ చేసింది. టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా సీతక్క.... ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరారు. ప్రస్తుతం అదే పార్టీలో యాక్టివ్ గా ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా మరోసారి ములుగు నుంచి బరిలో ఉండటం ఖాయంగా కనిపిస్తోంది.మొత్తంగా ఒకరేమో మాజీ నక్సలైట్, మరొకరేమో బలమైన నక్సలైట్ కుటుంబ నేపథ్యం ఉన్న నాగజ్యోతి ఎన్నికల బరిలో ఉండటంతో ములుగు అసెంబ్లీ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారిందనే చెప్పొచ్చు. అయితే ఈ ఎన్నికల్లో గెలుస్తానని నాగజ్యోతి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 2 నుంచి డబుల్ బెడ్ రూమ్ పంపిణీ

**హైదరాబాద్, ఆగస్టు 25:**

హైదరాబాద్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మొదలైంది. ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేస్తున్న లబ్దిదారులకు, వచ్చేనెల 2 నుంచి డబుల్‌బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయనున్నారు. మొత్తం 12వేల లబ్దిదారులకు ఈ ఇండ్లను దశల వారీగా అందజేస్తారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు మంత్రి తలసాని. లబ్దిదారులను ఎంపిక చేసేందుకు లక్కీ డ్రా నిర్వహిస్తున్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు మంత్రి తలసాని.లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలనే మొదటిసారిగా ఆన్‌లైన్ డ్రాను తీస్తున్నట్టు చెప్పారు మంత్రి. ఔఎ రూపొందించిన ర్యాండమ్ సాఫ్ట్‌వేర్ ద్వారా అర్హులను ఎంపిక చేస్తున్నామన్నారు. హైదరాబాద్ జిల్లాలోని ఒక్కో నియోజకవర్గంలో మొదటి విడతలో 12 వేల మందికి ఇండ్లను అందజేస్తామన్నారు. మహానగరంలోని 24 నియోజకవర్గాల పరిధిలో ఒక్కో నియోజకవర్గానికి 7500 మంది చొప్పున 60వేల మందితో జాబితాను సిద్దం చేశారు అధికారులు. డబుల్‌బెడ్‌రూం కోసం లక్షల్లో అప్లై చేసుకున్నారు పేదలు. లక్షా 160వేల మంది దరఖాస్తు చేసుకోగా, 80వేల మంది చిరునామాలకు వెళ్లిన వారి స్థితిగతులను పరిశీలించారు అధికారులు.

# 5 వేల కోట్లతో కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**మున్నూరు కాపుల ప్లీనరీ సమావేశంకు తరలిరావాలి**

**-స్టేట్ మున్నూరు కాపు అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుట్టం పురుషోత్తం రావు**

**పెద్దపల్లి**

రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపుల కోసం 5 వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని స్టేట్ మున్నూరు కాపు అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జలవిహార్ లో ఆగస్టు 27న జరిగే మున్నూరు కాపు ప్లీనరీ సన్నాహక సమావేశంకు మున్నూరు కాపు నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపులు రాజకీయంగా ఎదుగుదలకు పాలక , ప్రతిపక్ష పార్టీలకు రాజకీయ డిక్లరేషన్ విడుదల చేస్తామని, అదేవిధంగా డిమాండ్ల పరిష్కార కోసం కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్టేట్ మున్నూరు కాపు యూత్ కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు మల్క రామస్వామి, గౌరవ అధ్యక్షులు అమ్మిరి శెట్టి రామస్వామి, జిల్లా జాయింట్ సెక్రెటరీ ఉనుకొండ తిరుపతి, జిల్లా కార్యదర్శి కల్వల శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశెట్టి కుమార్, నాయకులు తూముల రాజేశం , మీసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబరు 2వ వారంలో ఎన్నికల నోటిఫికేషన్


**హైదరాబాద్, ఆగస్టు 25**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు అలర్ట్ అవుతున్నాయి. బీఆర్ఎస్ ఇప్పటికే 115 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ప్రకటించింది. బీజేపీ, కాంగ్రెస్‌లు కూడా తొలి జాబితాను ప్రకటించేందుకు కసరత్తు చేస్తున్నాయి. మరోవైపు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం కూడా కసరత్తు ప్రారంభించింది. అక్టోబర్ రెండో వారంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. డిసెంబర్ రెండో వారంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తెలంగాణ అసెంబ్లీ పదవీకాలం 2024 జనవరి 16 వరకు ఉండగా.. 2014లో సార్వత్రిక ఎన్నికలతో పాటు ఉమ్మడి రాష్ట్రంలో కూడా చివరి ఎన్నికలు జరిగాయి. అయితే కేసీఆర్ 2018లో ఐదేళ్లు పూర్తి కాకుండానే ముందస్తు ఎన్నికలకు వెళ్లారు. ఇఅ అక్టోబర్ 6, 2018న షెడ్యూల్‌ను విడుదల చేసింది.

సరిగ్గా రెండు నెలల క్రితం డిసెంబర్ 7న పోలింగ్ జరిగింది. జనవరి 17న అసెంబ్లీలో ఎమ్మెల్యేలంతా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ప్రస్తుత అసెంబ్లీ జనవరి 16 వరకు మనుగడ సాగించే అవకాశం ఉంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మిజోరాం రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఏకకాలంలో నోటిఫై చేసే అవకాశం ఉంది. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే ముందు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి రెండుసార్లు రానుంది. ఎన్నికల సన్నాహాలను పరిశీలించేందుకు నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత సీఈసీ బృందం మరోసారి రాష్ట్రానికి రానుంది. అక్టోబరు 4న ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తర్వాత ఏ క్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్నికల డబ్బు ప్రభావం ఎక్కువగా ఉంది. తెలంగాణలోనూ డబ్బు ప్రభావం పెరిగిపోయిందని మొన్నటి, హుజూరాబాద్ ఉప ఎన్నికలను బట్టి చెప్పవచ్చు. ఈ ఉప ఎన్నికల్లో పార్టీలు పెద్దఎత్తున డబ్బు పంచినట్లు ప్రచారం సాగింది. దీంతో ఎన్నికల్లో డబ్బు ప్రభావం పడకుండా నిఘా పెంచనున్నారు. ఎన్నికల సంఘం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలను కూడా మోహరించనుంది.క్టోబరు రెండో వారంలోగా షెడ్యూల్‌ను ప్రకటించడానికి కసరత్తు మొదలు పెట్టింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యుల బృందం తెలంగాణలో పర్యటించేందుకు రెడీ అవుతోంది. అక్టోబరు మొదటి వారంలో రాష్ట్రంలో పర్యటించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్...2018లో ఏడాది ముందుగానే అసెంబ్లీను రద్దు చేసి ఎన్నికలకు వెళ్లారు. 2018 అక్టోబరు 6న షెడ్యూల్, డిసెంబరు 7న పోలింగ్ జరిగింది. ప్రస్తుత గడువు వచ్చే ఏడాది జనవరి 16 వరకు ఉంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల అసెంబ్లీలకు గడువు కూడా జనవరిలోనే ముగియనుంది. మిజోరం అసెంబ్లీ గడువు మాత్రం డిసెంబరు 17తో ముగియనుంది. అక్టోబరు, నవంబరు నెలల్లో ప్రభుత్వ సెలవులతోపాటు స్థానిక పండగల సెలవులపైనా కేంద్ర ఎన్నికల సంఘం ఆరా తీస్తోంది. అక్టోబరు, నవంబరు నెలల్లో దసరా, బతుకమ్మ, దీపావళి పండగలు ఉన్నాయ్. ఈ పండుగలను తెలంగాణలో అత్యంతవైభవంగా నిర్వహిస్తారు. ఇవి తప్పా వేరే సెలవులు లేవు. ఎన్నికల జరిగే రాష్ట్రాల్లో కేంద్ర ఎలక్షన్ కమిషన్ పూర్తి స్థాయి బృందం రెండు దఫాలు ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తుంది. షెడ్యూల్ ప్రకటించటానికి ముందు ఒకసారి... నామినేషన్ల గడువు ముగిసిన తరవాత ఈ పర్యటనలు చేస్తుంది. ఎన్నికలు నిర్వహించడానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయా లేవా అన్న అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తుంది. ఎన్నికల సంఘంలోని ఉన్నతస్థాయి అధికారుల బృందం...ఇప్పటికే రాష్ట్రంలో పర్యటించింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రాష్ట్రంలో ముమ్మరంగా సాగుతోంది. నవంబరు 4న తుది ఓటర్ల జాబితాను వెలువరించనున్నారు. డిసెంబరులోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేలా ఈసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. డిసెంబరు 10లోపు పోలింగ్ ను పూర్తి చేసి...వారం రోజుల్లోనే కౌంటింగ్ నిర్వహించేలా కసరత్తు చేసింది. ఎన్నికల పరిశీలకులను నియమించేందుకు అధికారుల గుర్తింపు ప్రక్రియను షురూ చేసింది. కీలక నియోజకవర్గాల్లో ప్రత్యేక పరిశీలకులను నియమించనుంది. అక్టోబరులో రాష్ట్ర పర్యటన సందర్భంగా ఎన్నికల నిర్వహణపై సమీక్షించనుంది. మరోవైపు బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్...ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఆశావహులను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. బీజేపీ మాత్రం అభ్యర్థుల అన్వేషణలో నిమగ్నమైంది.

# సహకార బ్యాంకులకు ప్రభుత్వ సహకారం

**నెల్లూరు**



నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకులో 13 జిల్లాల డీసీసీ బ్యాంకుల సీఈఓల కాన్ఫరెన్స్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన రెండు మొబైల్ ఏటిఎంలను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ డిసిసి బ్యాంకుల సీఈఓ లు చిత్తశుద్ధితో పనిచేసి సహకార బ్యాంకుల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సహకార బ్యాంకులకు ఈ ప్రభుత్వ సహకారం ఎల్లవేళలా ఉంటుందని స్పష్టం చేసారు.

రాష్ట్ర ఆప్కాబ్ చైర పర్సన్ ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ సహకార బ్యాంకుల సరికొత్త టెక్నాలజీతో, నూతన ఆలోచన విధానాలతో ముందుకెళ్తున్నట్టు పేర్కొన్నారు.

ఈ కాన్ఫరెన్స్ కు ఆప్కాబ్ ఎండి శ్రీనాథ్ రెడ్డి, నాబార్డ్ జనరల్ మేనేజర్ జయ కన్నన్, నెల్లూరు డిసిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు హజరయ్యారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్ రెడ్డి అరెస్ట్

**పెద్దపల్లి**



భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీల అమలుకోసం వ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేయడాని వెళ్తున్న క్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి పోలీసులు అరెస్ట్ చేసి పెద్దపల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈసందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోందని కనీసం కలెక్టర్ కలిసి వినతిపత్రం అందజేయడానికి కూడా అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే కేవలం తన సొంత ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేస్తూ ప్రజలను, ఇతర పార్టీల నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తూ రాక్షస పాలన సాగిద్దున్నదని అన్నారు. రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, ప్రభుత్వం వచ్చాక కేసీఆర్ ని స్థానిక ఎమ్మెల్యే ని జైలుకు పంపడం ఖాయమని అన్నారు. భారతీయ జనతా పార్టీ తరుపున పెద్దపల్లి నియోజకవర్గ సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని ఎవరికి భయపడే ప్రసక్తి లేదని అన్నారు.

## లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**పెద్దపల్లి**

ప్రభుత్వ లక్ష్యాలను సకాలం లో పూర్తి చేసేలా అధికారులు కట్టుదిట్ట మైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ తో కలిసి గృహలక్ష్మి లబ్దిదారుల ఎంపిక, ధరణి పోర్టల్ దరఖాస్తుల పరిష్కారం, ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 59 కింద రుసుము వసూలు, జీ.ఓ.58 దరఖాస్తుల పరిశీలన, ఇంటి పట్టాల పంపిణీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఆర్డీవో లు, తహసిల్దార్లతో సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులతో సమీక్షిస్తూ, ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 మొదటి దశ కింద రుసుము వసూలు ప్రక్రియ ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని, రుసుము వసూలుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 59 రెండవ దశ కింద జిల్లాలో 840 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో ఇప్పటివరకు 817 దరఖాస్తులు పరిశీలన పూర్తి చేశామని, రెండవ దశలో ఆమోదించిన దరఖాస్తు దారులు చెల్లించాల్సిన రుసుము వివరాలు తెలియజే యాలని, ఒకే దఫా చెల్లింపు జరిగితే 5 శాతం రిబేట్ వస్తుందని అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు 58 కింద రెండవ దశలో 1414 దరఖాస్తులు వచ్చాయని, 594 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని, పెండింగ్ దరఖాస్తుల పరిశీలన వారం రోజులలో పూర్తి చేసి, అర్హులైన లబ్దిదారులకు పట్టాలను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గృహలక్ష్మి పథకం కింద పెద్దపెల్లి జిల్లాలో 33 వేల 816 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు 33 వేల 577 దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని, పెండింగ్ దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ధరణి పోర్టల్ లో వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ ధరణి సమస్యల పరిష్కారానికి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని, పెండింగ్ మ్యూటేషన్ దరఖాస్తులు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, ధరణిలో జి.ఎల్.ఎం, టీఎం 33 మాడ్యుల్ దరఖాస్తులు త్వరగా విచారణ చేపట్టి కలెక్టర్ పోర్టల్ కు పంపాలని అన్నారు. జిల్లాలో మీ సేవ, ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని , ఆదాయ, కుల ధృవీకరణ సర్టిఫికెట్లు ప్రజలకు సకాలంలో అందే విధంగా తహసిల్దారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పేదలకు పంపిణీ కోసం 11 ఎకరాలలో 442 ఇంటి పట్టాలను సిద్ధం చేశామని, ఇప్పటివరకు 163 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ పూర్తి చేసామని, జిల్లాలో పెండింగ్ లో ఉన్న 279 ఇంటి పట్టాల పంపిణీ కోసం లబ్ధి దారులను వారం రోజులలో ఎంపిక చేసి పట్టాల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారు లకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో లు మధుమోహన్, వి.హనుమా నాయక్, తహసిల్దార్ లు, కలెక్టరేట్ సి - సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాష్ , ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్, ఈ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## మంథనిలో ఘనంగా బీపీ మండల్ జయంతి

**మంథని**

బీసీల రిజర్వేషన్ పితామహుడు బిపి మండల్ జయంతి మహోత్సవాన్ని శుక్రవారం మంథని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మంథని పట్టణంలోని పాత పెట్రోల్ బంకు వద్ద గల బిపి మండల్ విగ్రహానికి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో మంథని ఎంపీపీ కొండా శంకర్, జెడ్పిటిసి తగరం సుమలత,సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ లతో పాటు టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నాయకుడు పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు బీసీల రిజర్వేషన్ పితామహుడు బిపి మండల్ జయంతిని నిర్వహిస్తున్నామన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించి సమాజంలో తలఎత్తుకునేలా చేసిన ఘనత బీపీ మండల్‌కు దక్కుతుందని వారు పేర్కొన్నారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, హైకోర్టు జడ్జి, పార్లమెంట్ సభ్యుడు, సంఘసంస్కర్త బిందేశ్వర్ ప్రసాద్ మండల్ రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ గా ఆనాడు 1990 ఆగష్టు 7వ తేదీన ఆయన ఇచ్చిన కమిషన్ నివేదిక ఆధారంగానే నాటి ప్రధాని విపి సింగ్ మండల్ కమిషన్ సిఫార్సులను అమలుచేస్తున్నామని ప్రకటించడం వలన ఈరోజు భారతదేశంలో దాదాపు 3,600 పైగా కులాలకు రిజర్వేషన్లు అందుతున్నాయని అన్నారు. ఆనాడు బీపీ మండల్ అంటేనే అగ్రకులాల నాయకులు భగ్గుమంటున్నా ఆయన వెనుకడుగు వేయకుండా భారతదేశంలోని బడుగు బలహీన వర్గాల కోసం చేసిన కృషి, చూపిన చొరవ, ఆయన తెగువ మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వీకే రవి, శ్రీపతి బానయ్య, కుర్ర లింగయ్య, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు కన్నవేన శ్రీనివాస్ యాదవ్, నాయకులు కొట్టే రమేష్, బత్తుల సత్యనారాయణ, నక్క శంకర్, బెజ్జంకి డిగంబర్, ఇర్ఫాన్, ఆసిఫ్, ఎస్ కే యాకూబ్, పోలు కనకరాజు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## పెరేడ్ గ్రౌండ్స్ లో ఎస్సై అభ్యర్థుల ఫిజికల్ పరీక్షలు

**ఏలూరు**

ఏలూరు రేంజి పరిధిలో సివిల్ సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీసు (పురుషులు/ మహిళా లు ) , ఏ.పి.యస్.పి,అర్.ఎస్. ఐ పురుషులు ఉద్యోగముల ప్రిలిమినరీ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఫిజికల్ మేజేర్మెంట్ పరీక్ష (పి.ఏం.టి) ఫిజికల్ ఎఫిషయన్స్ పరీక్ష లను ఏలూరు పెరేడ్ గ్రౌండ్ లో శుక్రవారం ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి. అశోక్ కుమార్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్ పర్యవేక్షణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ డిఐజి మాట్లాడుతూ డీఎస్పీలు ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, ఏ.అర్.అర్. ఐ లు,పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అనుమానాలకు తావివ్వకుండా నిష్పక్షపాతముగా పారదర్శకంగా పోటీలను నిర్వహించేందుకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసామన్నారు. ఎటువంటి ఇబ్బందులు అభ్యర్థులకు కలగకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకొని వైద్యపరమైనటు వంటి అంశాలలో తగిన ఏర్పాటు చేసి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న ప్రాంతాలలో అంబులెన్సను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.,

## ఎమ్మెల్యే శ్రీధర్ బాబును దూషించడం సరైన పద్ధతి కాదు

**మంథని బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేల్పుల రాజు**

**మంథని**

గొల్లపల్లి నుండి మంథని వరకు మొన్న జరిగిన బిఆర్ఎస్ ర్యాలీలో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను బిఆర్ఎస్ పార్టీ మంథని అసెంబ్లీ అభ్యర్థి పుట్ట మధు దూషించడం సరైన పద్ధతి కాదని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేల్పుల రాజు అన్నారు. శుక్రవారం మంథని ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేల్పుల రాజు ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పుల రాజు మాట్లాడుతూ మొన్న బిఆర్ఎస్ ర్యాలీలో పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు మాటలను తీవ్రంగా ఖండించారు. పుట్ట మధు నువ్వు గత తొమ్మిది సంవత్సరాలు అధికారం లో ఉండి మంథని ప్రాంతానికి ఏం అభివృద్ధి చేశావో చెప్పుకో అంతేగాని నువ్వు నీ చెంచా గాళ్ళతో కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడితే ఖబర్దార్ అని హెచ్చరించారు.మంథనిలో ఎంతమంది దళితులకు దళిత బంధు ఇప్పించావో, ఎంతమందికి బీసీలకు బీసీ బందు ఇప్పించావో చెప్పాలి అని అన్నారు. మంథని ప్రాంత ప్రజలు నాలుగుసార్లు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ని ఎమ్మెల్యేగా గెలిపించారని, మళ్లీ కూడా మంథని ప్రాంతానికి శ్రీధర్ బాబు భారీ మెజార్టీతోని గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు . పుట్ట మధు నువ్వు టికెట్ తెచ్చుకొని నీ అభివృద్ధి ఏంటో ప్రజలకు చూపించి ఓట్లు వేపిచ్చుకో అంతేగాని మా నాయకుడు శ్రీధర్ బాబు గురించి మాట్లాడితే ఇంకొకసారి ఊరుకునే సవాలే లేదు అని అన్నారు. మంథనిలో బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతమంది నిరుపేదలకు డబుల్ బెడ్రూంలు ఇప్పించావో చెప్పాలని కోరారు. ఇంకొకసారి మా కాంగ్రెస్ పార్టీ నాయకులపై గాని, మా ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు పైన పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ఊరుకునే సవాలే లేదని, నీ గురించి నీ చరిత్ర గురించి కరపత్రం రిలీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రావికంటి సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు లైసెట్టి రాజు, పార్వతి కిరణ్ పటేల్, ఖానాపూర్ మాజీ సర్పంచ్ దోరగొల్ల శ్రీనివాస్ యాదవ్ లు పాల్గొన్నారు.

## ముగ్గురు ఆత్మహత్యాయత్నం-ఒకరి మృతి..ఇద్దరి పరిస్థితి విషమం

**విశాఖపట్నం**

పెందుర్తి పరిధిలోని గొరపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. గురువారం రాత్రి ఒకే కుటుంబంలో విషం తాగి ముగ్గురు ఆత్మహత్య ప్రయత్నం చేసారు. కొడుకు కల్లూరి సంతోష్ కుమార్ రాత్రి 11 గంటలకు ఇంటికి చేరి చూసే సరికి కుటుంబసభ్యులు అపస్మారక స్థితిలో ఉన్నారు. దాంతో సంతోష్ స్థానికుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసాడు. స్థానికులు పోలీసులు సాయంతో వారిని కేజీహెచ్ కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తండ్రి కల్లూరి సత్యనారాయణ (51) మృతి చెందారు. తల్లి సూర్య కుమారి ( 45) చెల్లి నీలిమ (21) ప రిస్థితి విషమంగా వుంది.

## అభివృద్ధిలో రాజకీయాలు లేవు

**వనపర్తి**

వనపర్తి మంత్రి రి క్యాంపు కార్యాలయంలో 395 మందికి రూ.3.95 కోట్ల విలువైన బీసీ బంధు ప్రొసీడింగ్స్, 361 మంది దివ్యాంగులకు పెంచిన ఫించన్ రూ.3016 నుండి రూ.4016 ప్రొసీడింగ్స్ లబ్దిదారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శుక్రవారం అందచేసారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, రాష్ట్ర సహకార సంస్థల చైర్మన్ రాజా వరప్రసాద్ రావు, జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్ గౌడ్ , జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిలో రాజకీయాలు లేవు. కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుభీమా, కళ్యాణలక్ష్మి, న్యూట్రిషన్ కిట్ ల మాదిరిగా పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాల వర్తింపు వుంటుందని అన్నారు. అందరూ బాగుండాలి. అందులో మనం ఉండాలి. కుల వృత్తులకు అండగా తెలంగాణ ప్రభుత్వం నిలిచింది. సామాన్యులకు అండగా నిలవాలి అన్నది కేసీఆర్ ఆలోచన. వృత్తులు గతంలో మాదిరిగా వారికి ఉపాధి ఇవ్వడం లేదు. వారికి ఆర్థిక చేయూత ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఆలోచన. దశలవారీగా అందరికీ రూ.లక్ష సాయం. ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకుంటే విడతలవారీగా ప్రతి ఒక్కరికీ సాయం అందుతుంది. 395 మందికి బీసీ బంధు కింద రూ.లక్ష చొప్పున తొలివిడత చెక్కులు పంపిణీ చేసారు. పనిచేసుకునే ప్రతి చేతికి పని కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. గత 9 ఏళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ అదే లక్ష్యంతో పనిచేస్తున్నారు. నేడు తెలంగాణ నుండి వలసలు ఆగిపోయాయి .. ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చి ఉపాధి పొందుతున్నారు. అన్నార్తులకు అండగా నిలవాలని ఆసరా ఫించన్లు ఇస్తున్నారు. దివ్యాంగులకు ఫించన్ రూ.4016కు పెంచడం మూలంగా వనపర్తి నియోజకవర్గంలో 6551 మందికి లబ్ది చేకూరింది. రైతును నిలబెట్టాలన్న ఉద్దేశంతో ఉచిత కరంటు, రైతుభీమా, రైతుబంధు, సాగునీళ్లు ఇస్తూ పండించిన పంటలు కొనుగోలు చేస్తూ అండగా నిలుస్తున్నారు. వ్యవసాయం బాగుపడడంతో దాని చుట్టూ అల్లుకున్న రంగాలు నిలదొక్కుకుంటున్నాయి. వ్యవసాయ రంగం బలపడడంతో అనేక వ్యాపార రంగాలు నూతనంగా ఏర్పాటు అవుతున్నాయని అన్నారు. ఒక్క వనపర్తిలో వెయ్యికి పైగా బంగారు దుకాణాలు, 50 వరకు బిర్యానీ సెంటర్లు ఏర్పాటయ్యాయి. కార్ల షోరూంలు, బైక్ షోరూంలు, సూపర్ మార్కెట్ల రాకతో వేల మందికి కొత్తగా ఉపాధి లభిస్తున్నది. ఒకనాడు పదెకరాల రైతు కూడా తిండికి తండ్లాడిన పరిస్థితి వుండేది. తెలంగాణ రాష్ట్రంలో ఆ దుస్థితి నుండి గట్టెక్కడం తెలంగాణ సాధించిన విజయం. సమాజంలో వెనకబడ్డ వారికి కార్పోరేషన్ల ద్వారా చేయూతనందిస్తాం. రాజకీయాలు, పైరవీలు, దళారులకు అతీతంగా సర్కారు పథకాల అమలు చేస్తున్నాం. పనిచేసిన ప్రభుత్వానికి ప్రజలు చేయూతనందించి, అండగా నిలవాలని మంత్రి కోరారు.

## తుమ్మలకు ఘన స్వాగతం

**ఖమ్మం**

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లా సరిహద్దు నాయకన్ గూడెం చేరుకున్నారు. ఆయన తుమ్మల అభిమానులు, అనుచరగణం ఘనంగా స్వాగతం పలికారు. జై తుమ్మల అంటూ నినాదాలు చేసారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి తుమ్మల వర్గం నేతలు భారీగి తరలివచ్చారు. పాలేరు టికెట్ దక్కకపోవడంతో తుమ్మల అసంతృప్తితో వున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన అనంతరం హైదరాబాద్ నుంచి ఖమ్మం జిల్లాలోకి శుక్రవారం ఆయన వచ్చారు. ఖమ్మం జిల్లా సరిహద్దు నాయకన్ గూడెం వద్ద ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేసారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి తుమ్మల అనుచరులు, అభిమానులు తరలివచ్చారు. తుమ్మల నాగేశ్వరరావు వర్గం మహా ర్యాలీ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో ఆసక్తి నెలకొంది. మహా ర్యాలీ ద్వారా తుమ్మల బలం, బలగాన్ని చూపాలని ఆయన వర్గం నేతలు పట్టుదలతో ఉన్నారు. పాలేరు నుంచి కచ్చితంగా పోటీలో ఉండాల్సిందేనని అవసరమైతే బీఆర్ఎస్ కు గుడ్ బాయ్ చెప్పి కాంగ్రెస్, లేదా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని తుమ్మల నాగేశ్వరరావు ను అభిమానులు అనుచరులు కోరినట్లు సమాచారం. .

## తాగిన మైకంలో విమాన ప్రయాణికుల హల్చల్

**హైదరాబాద్**

తాగిన మైకంలో దోహ నుండి కొచ్చిన్ వెళు తున్న ఇండిగో విమానంలో నలుగురు ప్రయాణికులు హంగామా సృష్టించారు. ఎయిర్లైన్స్ సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించ డంతో విమానాన్ని శంషాబాద్ విమానా శ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. సంచలనం సృష్టించిన ఈ ఘటన గురువారం నాడు చోటుచేసుకుంది. దోహ నుండి హైదరాబాద్ మీదుగా కొచ్చిన్ వెళ్తున్న ఇండిగో విమానంలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు మద్యం సేవించి విమానం సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. దీంతో విసిగిపోయిన ఎయిర్ లైన్స్ సిబ్బంది శంషాబాద్ ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విమానాన్ని శంషాబాద్ విమానా శ్రయానికి మళ్లించి అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ మేరకు నలుగురు ప్రయాణికులను అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది శంషాబాద్ ఆర్ జి ఐ ఏ పోలీసులకు అప్పగించారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారిపై న్యూసెన్స్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన విమానాశ్రయంలో సంచలనం సృష్టించింది.

## కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు గుట్టు రట్టు

**రంగారెడ్డి**

రాజేంద్రనగర్ ఉప్పర్ పల్లి లో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. వెల్లుల్లి పాయలను వాడకుండా ప్రమాదకరమైన రసాయనాలు ఉపయోగించి అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న స్థావరం పై ఎస్ ఓటి పోలీసులు దాడులు చేసారు. కలర్స్, యాసిడ్ ఉపయోగం. కుళ్లి పోయిన పేస్ట్ ప్యాకింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. ఆకర్షణీయంగా ప్యాకింగ్ డేట్స్ మారుస్తున్నారు. 4 టన్నుల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ సీజ్ చేసారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.

## ఆరు స్థానాల్లో సీపిఐ పోటీ

**హుస్నాబాద్**

హుస్నాబాద్ లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. చాడా మాట్లాడుతూ పొత్తుల కోసం ఎవరితోనూ సంప్రదింపులసిన అవసరం లేదు ఒకవేళ ఎవరైనా అడిగితే ఆలోచిస్తాం. సీపీఐ కి గట్టిపట్టున్న ఆరు స్థానాలతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గం లోనూ పోటీ చేస్తున్నాం. ఇంతకుముందు లాగానే పొత్తులు అంటూనే ఏలాంటి సంప్రదింపులు జరపకుండా కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించడం చాలా విడ్డూరం. ఏది ఏమైనా మా బలం ఉన్న ప్రతి చోట అభ్యర్థులను నిలబెడతమని వెల్లడించారు. మతోన్మాద బిజెపి పార్టీని ఓడించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తామని అన్నారు.

## బిజెపి సభ ఏర్పాట్లు

**ఖమ్మం**

ఈ నెల 27 న ఖమ్మం నగరంలో బిజెపి భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తుంది. నగరంలోని ఎస్.ఆర్ & బి.జి.ఎన్.ఆర్ కాలేజీ గ్రౌండ్ లో దాదాపు లక్ష మంది తో సభను సక్సెస్ చేయడానికి బిజెపి అగ్ర నాయకత్వం మొత్తం ఖమ్మం సభ పైనే దృష్టి పెట్టింది. డిసెంబర్ లో ఎన్నికలు ఉండడంతో ఈ సభను బిజెపి అధినాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బిజెపి సభ ఏర్పాట్లపై పోలీసు అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభకు సంబందించిన మ్యాప్ ను పార్టీ నేతలు పోలీసు అధికారులకు అందించారు.

## ఏఎన్ఎంల వరలక్ష్మీ వ్రతం

**ఖమ్మం**

సెకండ్ ఏ.ఎన్.ఎం ల నిరసన దీక్ష పదకొండో రోజుకు చేరింది.కొత్త కలెక్టరేట్ దగ్గర రోజుకో రీతిలో తమ నిరసనను తెలియ చేస్తున్నారు. ఈ రోజు శ్రావణ శుక్రవారం కావడంతో ఇంటిదగ్గర చేయవలసిన వరలక్ష్మి వ్రతం కలెక్టరేట్ దగ్గర టెంటు కింద జరుపుకున్నారు. గత 16 సంవత్సరాలుగా ప్రభుత్వం లో ఉండి సేవలందిస్తున్నామని నోటిఫికేషన్ ఇవ్వకుండా రెగ్యులరైజేషన్ చేయాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేస్తున్నారు. కరోనా కష్టకాలం లో కూడా ప్రాణాలకు తెగించి సేవాలందించాం మాకు ఇప్పుడు పరీక్షలు పెడుతున్నారు. మా సెకండ్ ఏఎన్ఎం లలో ఏజ్ బార్ అయినా వాళ్ళు కూడా ఉన్నారు కాబట్టి ఎలాంటి నోటిఫికేషన్ పరీక్షలు లేకుండా మాకు రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతున్నారు.

# 'ఘోస్ట్' ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 19న విడుదల



కరుణడ చక్రవర్తి డా శివరాజ్ కుమార్ హీరోగా హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ గా ప్యాన్ ఇండియా లెవెల్ లో రూపొందుతోన్న చిత్రం ఘోస్ట్. కన్నడ బీర్బల్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలు రూపొందించి తనకంటూ ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్న దర్శకుడు శ్రీని ఘోస్ట్ చిత్రానికి దర్శకుడు. ప్రముఖ రాజకీయనాయకుడు, నిర్మాత సందేశ్ నాగరాజ్ తన సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఘోస్ట్ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఘోస్ట్ ను ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 19న దసరా కానుకగా విడుదల చేయనున్నారు. రిలీజ్ డేట్ ఆకట్టుకునే పోస్టర్ తో అనౌన్స్ చేశారు. శివరాజ్ కుమార్ గన్ తో సీరియస్ లుక్ తో ఉన్న రిలీజ్ పోస్టర్ ఘోస్ట్ ఆగమనాన్ని ప్రకటిస్తోంది. పోస్టర్ మీద ఉన్న క్యాప్షన్ "చిష్ట్రవని ాష్ట్రజీటనీలిబ ాజూవజీని... ఐనినీలి ఎష్ట్రవ ఉష్ట్రనీబబి ఎబ ంతీతీతిలతినిణ" అంచనాలు మరింత పెంచేలా ఉంది. ఘోస్ట్ నుండి వచ్చిన కాన్సెప్ట్ మోషన్ పోస్టర్, బిగ్ డాడీ టీజర్ ల తర్వాత అటు ట్రేడ్ లోనూ ఇటు ప్రేక్షకుల్లో చిత్రం పై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి.

ఆకట్టుకునే ఘోస్ట్ ప్రచార చిత్రాల తో పాటు, ఇటీవల బ్లాక్ బస్టర్ జైలర్ లో శివన్న పాత్రకు వచ్చిన ట్రేమెండస్ రెస్పాన్స్ ఘోస్ట్ పై మరింత హైప్ ను తీసుకొచ్చింది. తమ భాషల్లో ఘోస్ట్ రైట్స్ కోసం పెద్ద పెద్ద బ్యానర్ ల నుండి ఆఫర్స్ వస్తున్నాయి. చిత్ర బృందం అక్టోబర్ రెండవ వారం నుండి దేశవ్యాప్తంగా స్పెషల్ ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నారు. సెప్టెంబర్ రెండవ వారంలో ట్రైలర్ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రముఖ నటులు అనుపమ్ ఖేర్, జయరామ్, ప్రశాంత్ నారాయణ్, అర్చన జాయిస్, సత్య ప్రకాష్, దత్తన్న ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. 'ఘోస్ట్' చిత్రానికి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. మస్తీ, ప్రసన్న వి ఎం డైలాగ్స్ రాస్తున్నారు. మోహన్ బి కేరే ప్రొడక్షన్ డిజైనర్ గా పనిచేస్తున్నారు. పాపులర్ మ్యూజిక్ డైరెక్టర్ అర్జున్ జన్య సంగీతాన్ని అందిస్తున్నారు. కన్నడ లో టాప్ స్టార్స్, టెక్నీషియన్స్ తో చిత్రాలు తీసే సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాత సందేశ్ నాగరాజ్ 'ఘోస్ట్' ని లావిష్ స్కేల్ లో ప్రొడ్యూస్ చేస్తున్నారు. కన్నడ, తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం భాషల్లో ఘోస్ట్ అక్టోబర్ 19న దసరా కు ప్రేక్షకుల ముందుకి రానుంది.

నటీనటులు : డాక్టర్ శివరాజ్ కుమార్, అనుపమ్ ఖేర్, జయరామ్, ప్రశాంత్ నారాయన్, అర్చనా జాయిస్, సత్య ప్రకాష్, దత్తన్న మరియు తదితరులు

# 'సిద్ధార్థ్ రాయ్' నుంచి లైఫ్ ఈజ్ దిస్ సాంగ్



టాలీవుడ్‌లోని దాదాపు అందరు స్టార్ హీరోలతో పనిచేసిన పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్, యంగ్ హీరో దీపక్ సరోజ్ 'సిద్ధార్థ్ రాయ్' తో హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. హరీష్ శంకర్, వంశీ పైడిపల్లి వంటి పెద్ద దర్శకుల దగ్గర పనిచేసిన వి యశస్వీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటివలే విడుదలైన ఈ చిత్రం టీజర్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే ఈ చిత్రంలోని చెలియా చాలు పాట కూడా సూపర్ హిట్ అయ్యింది. తాజాగా సిద్ధార్థ్ రాయ్' నుంచి లైఫ్ ఈజ్ దిస్ బ్యూటిఫుల్ పాటని ప్రముఖ నిర్మాత దిల్ రాజు లాంచ్ చేశారు. స్టార్ కంపోజర్ రధన్ ఈ పాటని మెస్మరైజింగ్ అండ్ గ్రేస్ ఫుల్ నెంబర్ కంపోజ్ చేశారు. కార్తీక్ ఆ శ్రీనిషా జయశీలన్ పాడిన ఈ పాటకు యశస్వీ అందించిన సాహిత్యం మళ్ళీ మళ్ళీ వినాలనిపించే లా వున్నాయి. ఈ పాటలో లీడ్ పెయిర్ లవ్లీ అండ్ రొమాంటిక్ కెమిస్ట్రీ చాలా ఎట్రాక్టివ్ గా వుంది. శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్, విహాన్ ఆ విహిన్ క్రియేషన్స్ పతాకాలపై ప్రొడక్షన్ నెం 1గా జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయినలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. రధన్ సంగీతం అందిస్తుండగా, శ్యామ్ కె. నాయుడు కెమరా మెన్ గా, ప్రవీణ్ పూడి ఎడిటర్ గా పని చేస్తున్నారు.

తారాగణం: దీపక్ సరోజ్, తన్వి నేగి,నందిని, ఆనంద్, కళ్యాణి నటరాజన్, మాథ్యూ వర్గీస్

# "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" స్పెషల్ పోస్టర్



సుహాస్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "అంబాజీపేట మ్యారేజి బ్యాండు". ఈ చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు దుశ్యంత్ కటికినేని దర్శకత్వం వహిస్తున్నారు. శుక్రవారం హీరోయిన్ శివాని నాగరం బర్త్ డే సందర్భంగా స్పెషల్ పోస్టర్ ను రిలీజ్ చేసింది చిత్రబృందం. "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" సినిమాలో ఆమె నటిస్తున్న వరలక్ష్మి క్యారెక్టర్ లుక్ ను ఈ బర్త్ డే పోస్టర్ లో రివీల్ చేశారు.

వరలక్ష్మి లుక్ చూస్తుంటే ఆమె పాత్ర సినిమాలో పక్కింటి అమ్మాయి క్యారెక్టర్ లా ఉంటుందని తెలుస్తోంది. క్యాజువల్ డ్రెస్ లో ఆమె కాలేజ్ కు వెళ్తున్నట్లు పోస్టర్ లో చూపించారు. హీరో మల్లి లాగే వరలక్ష్మి క్యారెక్టర్ కూడా నేచురల్ ఫీలింగ్ కలిగిస్తోంది. కామెడీ డ్రామా కథతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మ్యారేజ్ బ్యాండ్ లీడర్ మల్లి క్యారెక్టర్ లో సుహాస్ కనిపించనున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉందీ సినిమా. "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" సినిమా టీజర్ ను త్వరలో రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు.

నటీనటులు - సుహాస్, శివాని నాగరం, జబర్దస్త్ ప్రతాప్ భండారి, గోపరాజు రమణ తదితరులు

# 'నా.. నీ ప్రేమ కథ' అందరూ తప్పకుండా చూడాల్సిన చిత్రం



**'నా.. నీ ప్రేమ కథ' టీమ్**

అముద శ్రీనివాస్ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'నా.. నీ ప్రేమ కథ'. కారుణ్య చౌదరి కథానాయిక. పోత్నాక్ శ్రవణ్ కుమార్ ఎంటర్ టైన్ మెంట్స్ పతాకంపై పోత్నాక్ శ్రవణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటివలే విడుదలైన ఈ చిత్రం టీజర్, ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 2 విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ ప్రెస్ మీట్ లో చిత్ర బృందం తో పాటు టీఎఫ్పీసీ సెక్రటరి ప్రసన్న కుమార్ , రామకృష్ణ గౌడ్, శోభారాణి పాల్గొన్నారు.

ప్రెస్ మీట్ లో ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. 'నా.. నీ ప్రేమ కథ' ప్రచార చిత్రాలు ఆసక్తికరంగా వున్నాయి. సినిమా చాలా బావొచ్చింది. టీం చాలా కష్టపడి ఈ సినిమా చేసింది. కొత్త దర్శకుడు నటుడు చాలా అంకితభావంతో పని చేశారు. చిన్న సినిమాలని ప్రోత్సహించాలి. ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం వుంది' అన్నారు.

అముద శ్రీనివాస్ మాట్లాడుతూ.. యధార్ధ సంఘటనలు ఆధారంగా తీసిన చిత్రమిది. నటుడి గా దర్శకుడి పని చేయడం ఒక సవాల్. మా డీవోపీ తో పాటు చిత్ర బృందం అంతా ఎంతో సహకరించింది. నిర్మాత శ్రవణ్ కుమార్ కుమార్ గారు ఎక్కడా రాజీపడకుండా సినిమాకి కావాల్సింది సమకూర్చారు. ఇందులో హీరో పాత్ర పేపర్ బాయ్, హీరోయిన్ డాక్టర్. వారి మధ్య ప్రేమ ఎలా పుట్టింది ? అనేది చాలా ఆసక్తికరంగా వుంటుంది. ప్రేమ ఎలా అయినా పుట్టొచ్చు అనేది ఇందులో చిత్రీకరించాం. యూత్, ఫ్యామిలీ అందరూ చూడాల్సిన మూవీ ఇది. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం వుంది" అన్నారు.

నిర్మాత పోత్నాక్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ.. కథ విన్న వంటనే చాలా నచ్చింది. దర్శకుడికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాను. తెలుగు రాష్ట్రాలలో చాలా ప్రాంతల్లో ఈ చిత్రం షూటింగ్ జరిపాం. ఇందులో పని చేసిన అందరూ వారి పాత్రకు న్యాయం చేశారు. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా చూసిన తర్వాత మరిన్ని చిత్రాలు చేయాలనే ఆసక్తి కలిగింది. సినిమాలో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇది చాలా మంచి సినిమా. మీ అందరి ఆదరణ కావాలి" అన్నారు,

శోభారాణి మాట్లాడుతూ.. కొత్త దర్శకుడు శ్రీనివాస్ ఎంతో అనుభవం వున్న నటుడు దర్శకుడిలా ఈ సినిమా చేశారు. టీజర్ ట్రైలర్ పాటలు చాలా బావున్నాయి. మంచి రచన కనిపిస్తోంది. శ్రీనివాస్ చక్కగా నటించారు. శ్రీనివాస్ కి తనకంటూ ఒక గుర్తింపు వస్తుందనే నమ్మకం వుంది. నిర్మాత శ్రవణ్ కుమార్ గారికి అభినందనలు. చిన్న సినిమాలు కూడా పెద్ద విజయాలు సాధిస్తున్నాయి. ఈ కథ చాలా బావుంటుంది. ఈ సినిమా కూడా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ చిత్రానికి ఎంఎస్ కిరణ్ కుమార్ కెమరామెన్ గా పని చేస్తున్నారు. ఎంఎల్ పి రాజా సంగీతం సమకూరుస్తుండగా చిన్నా నేపధ్య సంగీతం అందిసస్తున్నారు.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950